ప్రజాశక్తి
సోమవారం 15 సెప్టెంబర్ 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

వైద్య కళాశాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకుల బృందం

మార్కాపురం మెడికల్ కాలేజీని

ప్రభుత్వమే నిర్వహించాలి

- ప్రైవేటు వారికి అప్పజెప్పే విధానం రద్దు చేయాలి
- మెడికల్ కాలేజీని సందర్శించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించాలని, అదేవిధంగా పి-4 పేరుతో మెడికల్ కాలేజీ ప్రైవేటు వారికి అప్పజెప్పే విధానం రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం జిల్లా ▶ 2లో

సరళీకరణ విధానాలతో అసమానతలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు 8లో ▲

కొత్త ఉన్నతాధికారులకు

పాలనా సవాళ్లు..!

- అభివృద్ధితో పాటు రాజకీయ సమన్వయం కలెక్టర్ ఎజెండా
- శాంతిభద్రతలతో పాటు కఠినవైఖరితో ఉండాలని ఎస్పీకి హితబోధ

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

కలెక్టర్లు.. ఎస్పీల బదిలీలు జరిగిపోయాయి. కొత్త అధికారులు ఆగమేఘాలపై వారి బాధ్యతలు కూడా చేపట్టారు. పాత వాళ్లు బంగ్లాలు వదిలిపోయే లోపే హడావుడిగా కొత్త కలెక్టర్ రాజ బాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వచ్చి బాధ్యతలు చేపట్టారు. అన్నీ రెండ్రోజుల్లోనే వెంటవెంటనే జరిగిపోయాయి. కలెక్టర్, ఎస్పీలను రాష్ట్ర ప్రభుత్వం హఠాత్తుగా బదిలీ చేసింది. బదిలీల వ్యవహారం కొద్ది రోజులుగా చర్చ సాగుతోంది. అనుకున్నట్లుగానే ఇద్దరు ఉన్నతాధికారులనూ బదిలీ చేశారు.

శనివారం నాడు బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ రాజ బాబు

ఆదివారం నాడు బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

అందుకు కారణాలు అనేకం వినిపిస్తున్నాయి. ఏడాది పాలన ముగిశాక వీరి బదిలీ చర్చకు దారితీస్తోంది. పాలన ఆశించిన స్థాయిలో వేగం లేదన్నది అన్ని వైపుల నుంచి వచ్చిన సమాచారం. దీన్ని పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం అందుకు బాధ్యులుగా భావించి కలెక్టర్, ఎస్పీలను బదిలీ చేసిందనే చర్చ సాగుతోంది. ఈ తరుణంలో భవిష్యత్‌లో ఎలా ఉండాలో దిశానిర్దేశం చేసిన పాలక పెద్దలు అధికారులకు పోస్టింగులు ▶ 2లో

కలెక్టర్ తమీమ్అన్సారియాను సత్కరిస్తున్న జేసీ, డిఆర్ఒ

అందరి సహకారంతో

జిల్లా అభివృద్ధికి కృషి

5లో ▲



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఏచూరి స్మారక వైద్యశిబిరానికి విశేష స్పందన

4లో ▲

ఎస్పీ దామోదర్‌ను సత్కరిస్తున్న పోలీసు అధికారులు

ప్రజా సేవలో

నిబద్ధతతో ముందుకు సాగాలి

3లో ▲

కూటమి ప్రభుత్వంలోనూ

వెంటాడుతున్న సోనాబోట్ల సమస్య

- కడలూరు సోనాబోట్లను పట్టుకొనేందుకు ఇక్కడి మత్స్యకారుల వేట...
- స్పీడ్ బోట్లతో.. గాలింపు

కడలూరు బోట్ల కోసం వెతుకులాడుతున్న మత్స్యకారులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

తమిళనాడు రాష్ట్రంలోని కడలూరు నుంచి వచ్చే సోనా బోట్ల సమస్య ఇక్కడి మత్స్యకారులకు తీవ్ర తలనొప్పిగా మారిపోయింది. గత వైసిపి ప్రభుత్వంలో మత్స్యకారులకు మాయ మాటలు చెప్పి.. సమస్య పరిష్కారం చేస్తామని తప్పుకొని వెళ్లిపోయారు. నేడు కూటమి ప్రభుత్వంలోనూ అదే సమస్య కొనసాగుతోంది. మత్స్యకారులు ఆ కడలూరు బోట్ల కోసం గత మూడు రోజులుగా వేట నిలిపివేసి.. ఆ బోటు కోసం వేట కొనసాగిస్తున్నారు.

ఇప్పటికే నెల్లూరు, ప్రకాశం బాపట్ల జిల్లాల్లోని మత్స్యకారులు కడలూరు నుంచి వచ్చే బోట్లను ఆపివేయాలని ఒకరికొకరు అనుకొని నిర్ణయం తీసుకుంటున్నారు. తాజాగా గత మూడు రోజుల నుంచి నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని మత్స్యకారులు కడలూరు బోట్లపై సీరియస్‌గా ఉన్నారు. నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె వద్ద ఉన్న ఒక స్పీడు బోటును తీసుకొని గత రెండు రోజులుగా సముద్రంలో కడలూరు సోనా బోట్లు కోసం మత్స్యకారులు మూకుమ్మడిగా సముద్ర తీర ప్రాంతంలో గాలింపు చర్యలు చేపడుతున్నారు. కడలూరు బోట్లకు డ్రైవర్లుగా పోతున్న ఈ ప్రాంత మత్స్యకారులు అప్రమత్తమయ్యి.. ఈ ప్రాంతానికి రాకుండా వేట చేసుకుంటున్నారు. అయితే ఈ ప్రాంతంలోని మత్స్యకారులే ఆ సోనా బోట్లకు వెళ్లడం ద్వారా పెద్ద సమస్యగా మారిందని ఇక్కడ మత్స్యకారులు చెబుతున్నారు. గత మూడు రోజుల నుంచి సముద్రం వేటకు వెళ్లకుండా మత్స్యకార గ్రామాల్లో దండోరా వేసుకొని.. వేట నిలిపివేసి కడలూరు బోట్ల కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. మత్స్యకారులను ఈ సమస్య గత కొన్ని సంవత్సరాలుగా వెంటాడుతూనే ఉంది. ఈ సమస్య పరిష్కారం ▶ 3లో

గంజాయి విక్రయాల కట్టడిపై

ప్రత్యేక దృష్టి సారిస్తాం..

- బాపట్ల ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఉమామహేశ్వర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను కట్టడి చేయడం, మహిళలు, చిన్నపిల్లలపై జరుగుతున్న నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. ఆదివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో వేద మంత్రోచ్చారణల నడుమ జిల్లా 3వ ఎస్పీగా ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, రేపల్లె డీఎస్పీ ఏ. శ్రీనివాసరావు, బాపట్ల డీఎస్పీ జి. రామాంజనేయులు, చీరాల డీఎస్పీ ఎం.డి. మోయిన్, ఏ.ఆర్ డీఎస్పీ పి. విజయసారథి, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు తదితరులు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ సాధారణ బదిలీలలో భాగంగా బాపట్ల జిల్లాకు ఎస్పీగా నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ▶ 2లో

బాధ్యతలు చేపడుతున్న ఎస్పీ ఉమామహేశ్వర్

1న 'వాహన మిత్ర' ఆర్థిక సాయం అందజేత

నేడు లబ్ధిదారుల జాబితా పరిశీలన • 24 న తుది జాబితా విడుదల • మార్గదర్శకాలు విడుదల

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ, ఆటో కార్మికుల ఆందోళనతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆటోరిక్షా, మోటార్ క్యాబ్, మాక్సీ క్యాబ్ యజమానులు మరియు డ్రైవర్లకు ఏడాదికి రూ.15,000 వంతున అందజేసేందుకు ప్రభుత్వం ఆదివారం మార్గ దర్శకాలు విడుదల చేసింది. ట్రాన్స్‌ఫోర్ట్ చీఫ్ సెక్రటరీ ఎంటి కృష్ణబాబు ఆదేశాల మేరకు జిల్లా అధికారులు లబ్ధిదారుల ఎంపిక కోసం కసరత్తు ప్రారంభించారు. లబ్ధిదారులను ప్రాథమికంగా గుర్తించేందుకు 2023-24లో ఆర్థిక సహాయం పొందిన వారి జాబితాను సచివాలయాలకు పంపారు. 15 లోపు వాహనాల వివరాలను జిఎస్‌డబ్ల్యుఎస్ శాఖకు అందజేయాల్సి ఉంది. 17 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతుంది. కొత్త వారు ఈ నెల 19 లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 22లోపు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి 24న తుది జాబితా సిద్ధం చేసి రవాణా శాఖకు అందజేయాల్సి ఉంది. రవాణా శాఖ ధ్రువీకరించిన అనంతరం ప్రభుత్వ సంక్షేమ శాఖల ద్వారా లబ్ధిదారులకు నగదు పంపిణీ చేస్తారు. నగదు పంపిణీని అక్టోబర్ 1న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారు.

ఆర్థిక ప్రధాన అర్హతలు

అభ్యర్థి సొంత వాహనం కలిగి ఉండి, వాహనాన్ని నడపగలిగి ఉండాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీచేసిన చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. వాహనం రిజిస్ట్రేషన్, ట్యాక్స్, ఫిట్‌నెస్ సర్టిఫెకెట్లు ఫోర్స్‌లో ఉండాలి. ప్రయాణికుల వాహనాల యజమానులు మాత్రమే అర్హులు. ప్రతి కుటుంబానికి ఒకరు మాత్రమే అర్హులు. ఒకే కుటుంబంలో వాహన యజమాని ఒకరు, డ్రైవింగ్ లైసెన్స్ మరొకరి పేరుతో ఉన్నా అది అంగీకరించబడుతుంది. మూడు ఎకరాల మాగాణి, లేదా 10 ఎకరాల మెట్ట ఉండాలి. మెట్ట, మాగాణి కలిపి 10 ఎకరాల కంటే ఎక్కువ ఉండకూడదు.

పరిశీలన, వెరిఫికేషన్ ప్రక్రియ

గ్రామ/వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్లు ముందస్తుగా దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారి జాబితా ఎంపీడీఓ లేదా మున్సిపల్ కమిషనర్లకు పంపిస్తారు. ప్రాసెస్ అయిన అప్లికేషన్లు ఆన్‌లైన్ ద్వారా జిల్లా కలెక్టర్లకు పంపి ఆమోదం పొందుతారు. ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి అయిన తర్వాత మాత్రమే తుది జాబితా రూపొందించి వివిధ శాఖలకు (సంక్షేమ) పంపబడుతుంది.

చెల్లింపు విధానం

టాన్స్‌పోర్ట్ కమిషనర్ ప్రతిపాదనను రవాణా, రోడ్లు-భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి పంపిస్తారు. ఫైనాన్స్ శాఖ నుంచి పరిపాలనా ఆమోదం పొందిన తర్వాత నిధులు సంబంధిత కార్పొరేషన్ల వ్యక్తిగత డిపాజిట్ (పీడీ) ఖాతాలకు జమ చేయబడతాయి. ఆ తర్వాత జిఎస్‌డబ్ల్యూఎస్ విభాగం అందజేసిన తుది జాబితా ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు రెడ్డి, బ్రాహ్మణ కార్పొరేషన్, ఎస్‌సి కార్పొరేషన్, కమ్మ, ఎస్‌టి కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్, ఆర్యవైశ్య కార్పొరేషన్, మైనారిటీ కార్పొరేషన్, క్రైస్తవ కార్పొరేషన్, క్షత్రియ కార్పొరేషన్ ద్వారా నగదు చెల్లిస్తారు.

కొత్త ఉన్నతాధికారులకు పాలనా సవాళ్లు.!

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చారు. వెంటనే చేరిపోవాలని ఆదేశాలతో హడావుడిగానే కలెక్టర్, ఎస్పీ బాధ్యతలు స్వీకరించారు.ఇక కొత్త అధికారులకు భవిష్యత్ పాలన ఓ సవాలుగానే భావించక తప్పదు. ఎందుకంటే ఏడాది ముగిశాక ఇద్దరు జిల్లా ఉన్నతాధికారులను బదిలీ చేయడం కూడా అరుదుగానే ఉంది. గతంలో కలెక్టర్, ఎస్పీల బదిలీలు ఒకరితర్వాత ఒకరివి జరిగేవి. కొంత సమయం ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. తమ లక్ష్యాలకు అనుగుణంగా పనితీరు లేకనే ఇద్దరినీ బదిలీ చేశారనే చర్చ అధికారుల్లో నడుస్తోంది. కలెక్టర్ విషయానికి వస్తే నిన్నటివరకూ పనిచేసిన అన్సారియా ముక్కుసూటిగానే వెళ్లారు. మంత్రితో పాలనా పరమైన విషయాలన్నీ చర్చిస్తున్నా.. మిగతా ఎమ్మెల్యేలతో సమన్వయం కొంత లోపించిందనే చర్చ సాగుతోంది. కీలక భేటీల్లోనూ కలెక్టర్ బదిలీపై ఎమ్మెల్యేల మధ్య చర్చ నడిచింది. మాట వినడం లేదని కొందరు ఎమ్మెల్యేలు మంత్రుల ఎదుట వాపోయిన సందర్భాలూ ఉన్నాయి. ఏదేమైనా బదిలీ అనివార్యమైంది. కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాజ బాబు తన ఎజెండా ఏమిటో చెప్పారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటా మన్నారు. కలెక్టర్ మాటల్లోనే బదిలీ ఎందుకు జరిగిందో విదితమవుతోంది. ప్రజాప్రతినిధులతో సమన్వయమే ఇక్కడ కీలకంగా కనిపిస్తోంది. వెలిగొండ ప్రాజెక్టు ప్రాధాన్యతను గుర్తించి చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. ఏదేమైనా కలెక్టర్ ముందున్న అనేక సవాళ్లలో పాలనపరమైనవే.. పాలనలో వేగం పెంచాల్సి ఉంది. అందుకు రాజకీయ సమన్వయం కీలకంగా భావించి ఉద్బోధ చేసినట్లు తెలుస్తోంది. ఇక ఎస్పీగా వి.హర్షవర్ధన్‌రాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీ ఆర్డర్ జారీ చేసిన కొద్ది గంటల్లోనే ఆయన వచ్చి చేరిపోయారు. వేరే జిల్లాకు బదిలీపై వెళుతున్న ఎస్పీ దామోదర్‌కు కూడా ఇదే సమయంలోనే వీడ్కోలు పలికారు. ఎస్పీగా హర్షవర్ధన్‌రాజుకూ రానున్న కాలంలో ఎలాంటి పంథాలో వెళ్లాలో కూడా దిశానిర్దేశం చేశారు. పోలీసుశాఖ గత ప్రభుత్వంలో పనిచేసినట్లుగా లేదనే చర్చ పాలకపక్షంలోనే సాగుతోంది. ఎందుకంటే గతంలో వేధింపులకు గురయ్యామని, ఇప్పుడు ఆ కేసుల విషయంలోనూ పోలీసులు కఠినంగా లేరనే చర్చ సాగుతోంది. ప్రత్యర్థి పార్టీ నేతలతో చెట్టాపట్టాలు వేసుకొని నడుస్తున్నారనే ఆరోపణలు పలువురు అధికారులపై వచ్చాయి. ముఖ్యంగా వైసిపి నేతలతో స్నేహపూర్వకసంబంధాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలూ పోలీసు అధికారులపై వినిపిస్తున్నాయి. ఎస్పీ దామోదర్ శాంతిభద్రతల విషయంలో గట్టిగానే పనిచేశారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇచ్చారు. ఇదే ఆయనకు ఇబ్బందిగా మారిందా? అనే చర్చ కూడా జరుగుతోంది. ఇదే విషయాన్ని మంత్రులు ఆయా సందర్భాల్లో సిఎం చంద్రబాబు దృష్టిలో పెట్టినట్లు వినికిడి. ఏదేమైనా రానున్న కాలంలో ఇద్దరు కొత్త అధికారులు తమ బాధ్యత నిర్వహణలోనూ, పాలనా వ్యవహారాల్లో ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వెళతామని వెల్లడించారు.

గంజాయి విక్రయాల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారిస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

డీజీపీ హరీష్ కుమార్ గుప్తాలకు కృతజ్ఞతలు తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాల నియంత్రణ, మహిళలపై జరుగుతున్న నేరాల అరికట్టడం, సైబర్ నేరాల నివారణపై ప్రత్యేక దష్టి సారిస్తామని పేర్కొన్నారు.

జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష

నూతనంగా విధుల్లో చేరిన జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ జిల్లా పోలీస్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని శాంతి భద్రతల పరిస్థితులు, స్థానికంగా ఉన్న సమస్యలపై సమగ్ర చర్చ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతను అనుసరించి, జిల్లా పరిస్థితులకు అనుగుణంగా నేర నియంత్రణపై పోలీస్ అధికారులు దష్టి సారించాలని ఎస్పీ సూచించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను పూర్తి స్థాయిలో అరికట్టాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. దీనికోసం తగిన కార్యాచరణను వెంటనే ప్రారంభించాలన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే విధంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు "విజిబుల్ పోలీసింగ్" మరియు 'ఎన్‌ఫోర్స్మెంట్' విధులను నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు., తీర ప్రాంతాల్లో పోలీస్ గస్తీని మరింతగా పెంచాలని తెలిపారు. ఎవరైనా పోలీస్ స్టేషన్‌కు వస్తే తక్షణమే స్పందిస్తూ బాధితులకు సహాయం చేయాలని తెలిపారు. పోలీసులు తక్షణం స్పందించి తీసుకునే చర్యల వల్ల నేరాలను ఆదిలోనే అరికట్టేందుకు అవకాశం ఉందన్నారు.

కలెక్టర్‌కు తమీమ్ అన్సారియాకు సత్కారం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నలభై ఏళ్ళ దళిత ఉద్యమంలో తాను చూసిన ఎంతోమంది కలెక్టర్లలో మానవతా వాది, నిజమైన పేదల కలెక్టర్ .తమీమ్ అన్సారియా అని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు తెలిపారు. ఆదివారం రిమ్స్ ఆడిటోరియంలో కలెక్టర్‌కు ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వమించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ దళితులు, పేదలు, మహిళలకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అనంతరం కలెక్టర్‌కు భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ప్రతిమను బహూక రించారు. కలెక్టర్‌ను అభినందించిన వారిలో బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పొటికలపూడి జయరాం, మాల మహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య, ఎయిమ్ అధ్యక్షుడు కసుకుర్తి ఆగమన రాజు, పత్రా బంగారం ఉన్నారు.

మార్కాపురం మెడికల్ కాలేజీని.. ప్రభుత్వమే నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి షేక్ మాబు డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని రాయవారం గ్రామంలో అసంపూర్తి దశలో ఉన్న వైద్య కళాశాలను సిపిఎం నాయకుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతానికి మెడికల్ కాలేజీ అత్యంత అవసరమని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చిన వంద రోజుల్లో మెడికల్ కాలేజీ ప్రభుత్వ ఆధ్వర్యంలో వెంటనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందని మండిపడ్డారు. ప్రకాశం జిల్లాలో పశ్చిమ ప్రాంతమైన ఎర్రగొండపాలెం, గిద్దలూరు, మార్కాపురం, కనిగిరి, దర్శి ప్రాంతాలలోని పేద, దళిత గిరిజన ప్రజలకు వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలంటే మెడికల్ కాలేజీ అవసరమని, ఇక్కడి ప్రజలకు చిన్నపాటి రోగం వచ్చిన ఒంగోలు, కర్నూలు, నంద్యాల, గుంటూరు వంటి పట్టణాలకు వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దురదష్టవశాత్తు వైద్యం కోసం వెళ్లే రోగుల్లో కొంతమంది మార్గమధ్యలోనే ప్రాణాలు సైతం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన వైద్యం అందకనే ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో మార్కాపురం ప్రాంతానికి అవసరమైన మెడికల్ కాలేజీని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వ నిర్వహణలో పూర్తి చేసి, ప్రభుత్వ ఆధీనంలోనే వైద్య కళాశాల కార్యకలాపాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పి-4 విధానం అమలు జరిగితే కాలేజీ ప్రైవేటీకరణ అవుతుందని, ప్రైవేటు వైద్యం అంటే అన్ని రకాల వైద్యసేవలు డబ్బుతో కొనవలసిందేనని అన్నారు. కూటమి ప్రభుత్వం పి-4 పేరుతో మెడికల్ కాలేజీని కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడానికి సిద్ధమైందని, ఇది ప్రజల ప్రాణాలను కార్పొరేట్లకు అప్పజెప్పడమేనని పేర్కొన్నారు. పి-4 విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీ నిర్మాణం పేరుతో జరుగుతున్న రాజకీయాలను ఆపాలని, నిర్మాణంపై శ్రద్ధ పెట్టి వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి సోమయ్య, పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ, మండల కార్యదర్శి గుమ్మ బాలనాగయ్య, పట్టణ నాయకులు పి.రూబెన్ ఎస్కే నన్నేసా ఎస్కే, మహబూబ్ బాషా, ఏనుగుల సురేష్ కుమార్, ఎస్కే నబి, టి రవికుమార్ మండల నాయకులు జి రాజశేఖర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, అద్దంకి

O.S.No : 71/2014

వల్లెపు ఆంజనేయులు .... వాది

మరియు

1.వల్లెపు హనుమంతరావు (లేటు)
2.వల్లెపు సుజాత W/o హనుమంతరావు (లేటు)
3.వల్లెపు సరిత D/o హనుమంతరావు (లేటు)
4.దేవళ్ళ సుస్మిత D/o హనుమంతరావు (లేటు) W/o సురేంద్ర
5. దేవళ్ళ ఉషా D/o హనుమంతరావు (లేటు) W/o నరేంద్ర
ఉజిలీ పేట, చీరాల .... ప్రతివాదులు

పై నంబరు దావాలో మరియు I. A 2122/2024, I.A2123/2024, I.A 2124/2024, I.A.2125/2024, I.A. 2126/2024, I.A.27/2024 లలో వాది మీకు ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసు కోకుండా ఇబ్బంది కలుగు చేయుచున్నందున పై శ్రీ కోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా దావా సమన్లు మీకు జారీ అ గునట్లుగా ఉత్తర్వులు దయచేసినారు. మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల పై కోర్టులో16-09-2025 ఉదయం 10.30 గంటలకు తెలుపుకొనవలయును. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

వాయిదా తేది : 16-09-2025

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //

ఇట్లు
S.A సలీం
వాది తరుపు న్యాయవాది
సెల్ నెం: 98485 26413

వేలం ప్రకటన

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.No:74/2019
IN
O.S.No: 284/2017

ముప్పాళ్ళ ఓంకారం బాబు @ ఓంకార్ బాబు .... D.H.R

మరియు

మాలెంపాటి మౌనిక మరియు ఒకరు ... J.D.Rs

పై నంబరు E.Pలో ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై కోర్టు వారు తేది 06-10-2025న ఉదయం గం.10.30ని.లకు పైకోర్టులో బహిరంగ వేలం జరుపుతున్నారు. కావున కావలసినవారు సదరు కోర్టు వారి షరతులకు లోబడిపాట పాడుకొనవచ్చును.

షెడ్యూల్

ప్రకాశం జిల్లా (ప్రస్తుతం బాపట్ల జిల్లా) - నరసరావు పేట జిల్లా రిజిస్ట్రేషన్ సంతమాగులూరు (మండలం) తంగేడు మల్లి రెవెన్యూ గ్రామం

D.No: 199/LB-an extent of AC1.25 cts of Dry land within the following boundaries.

East: Donka,
South: Land of Malempati srinivasarao,
West: Land of Dhulipalla venkaiah Etc,
North: Land of MalempatiVenkateswaralu
DHR Value: Rs : 1,25,000/-
Aminvalue Rs: 8.25,000/-
Market value Rs: 6.25.000/-
Date of sale: 06.10-2025
Date of Further Hearing 13-10-2025

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో //

అద్దంకి
తేది:14-09-2025

జె.రామచంద్రరావు, B.Com,.B.L
డి.హెచ్.ఆర్ తరుపు అడ్వకేటు
అద్దంకి

మహారాజశ్రీ
మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఇ.పి. 165/2015
ఇన్
ఓ.ఎస్. 112/2012

గాలి వెంకటేశ్వర్లు ..... డిక్రీ హోల్డర్

వర్సెస్

1. బొల్లెపల్లి చిన్న రంగయ్య చనిపోయినందున వారసులు
2. బొల్లెపల్లి క్రిష్ణమ్మ, భర్త: లేట్ చిన్న రంగయ్య
3. బొల్లెపల్లి స్వప్న, తండ్రి: లేట్ చిన్న రంగయ్య
4. బొల్లెపల్లి స్వాతి, తండ్రి: లేట్ చిన్న రంగయ్య
5. బొల్లెపల్లి మోహనరావు, తండ్రి: లేట్ చిన్న రంగయ్య

ముటుకుల గ్రామస్తులు, పుల్లలచెరువు మండలం, ప్రకాశం జిల్లా.

టు,
జె.డి.ఆర్-2:బొల్లెపల్లి క్రిష్ణమ్మ, భర్త: చిన్న రంగయ్య ముటుకుల గ్రామం, పుల్లలచెరువు మండలం, ప్రకాశం జిల్లా.

పైఇ.డి.లో జె.డి.ఆర్-2కు ఎన్ని పర్యాయములు ఆర్డర్ 21 రూల్ 66 సేల్ నోటీసు పంపిననూ తీసుకొనకుండా కాలాయాపన చేయు చున్నందున ఘనమైన కోర్టు వారు ఆర్డర్ 21 రూల్ 66 సేల్ నోటీసులను జె.డి.ఆర్-2 కు ప్రజాశక్తి డైలీ న్యూస్ పేపర్‌లో ప్రచురించమని కోర్టు వారు ఆర్డర్ వేసియున్నారు. కనుక సదరు కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఆర్డర్ 21 రూల్ 66 సేల్ నోటీసు వాయిదా ఈ నెల 17వ తేదీన ఉన్నది. కావున మీరు ఆ రోజు ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట మీరు గానీ, మీ తరపున వకీలు ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మాణం చేయుదురని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 17-09-2025
మార్కాపురం **పి.సత్యనారాయణ,**
పిటీషనర్ తరపు అడ్వకేట్.

అతివేగానికి నిండు ప్రాణం బలి

మోటారుసైకిల్‌ను కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

కారు డ్రైవర్ అతి వేగం నిండు ప్రాణం బలి తీసుకుంది. సంత నూతలపాడు మండలం, పేర్నమిట్టలో కారు అతివేగంగా ఢీకొట్టడంతో మోటారుసైకిల్ నడుపు తున్న వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన ఆదివారం ఉదయం జరిగింది. సమతానగర్‌కు చెందిన రాయని శేషయ్య (52) పేర్నమిట్టలో కిళ్లీ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం ఉదయం కూడా ఆయన టివిఎస్ బైక్‌పై దుకాణానికి వెళు తున్నాడు. అదే సమయంలో షేక్ సుభానీబాషా అతివేగంతో ఎపి 37 సిఆర్ 4545 నెంబర్ గల కారును నడుపుతూ.. పేర్నమిట్ట, టుబాకో బోర్డు సమీపంలో టివిఎస్‌పై వెళుతున్న శేషయ్యను ఢీకొట్టాడు. అతివేగం కారణంగా కారు ఫల్టీలు కొట్టి.. బోల్తా పడింది. టివిఎస్ వాహనం నుజ్జునుజ్జయింది. శేషయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. కాలు విరిగిపోయింది. స్థానికులు కొన ఊపిరితో ఉన్న శేషయ్యను హుటాహుటిన ఒంగోలులోని వెంకట రమణ నర్సింగ్‌హోంకు తరలించారు. అక్కడ శేషయ్య మృతిచెందాడు. కారు నడుపుతున్న సుభానీబాషా మద్యం మత్తులో ఢీకొట్టాడా.? లేక నిద్ర మత్తులో ఢీకొట్టాడా.? అనే విషయంపై పోలీసులు విచారిస్తున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుంటామని తాలూకా పోలీసులు తెలిపారు. తాలూకా ఎస్ఐ హరిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు శేషయ్య భార్య రెండేళ్ల క్రితమే అనారోగ్యంతో మృతిచెందింది. ఇప్పుడు శేషయ్య కూడా మృతిచెందడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

శేషయ్య (ఫైల్)

బోల్తా పడ్డ కారు, నుజ్జునుజ్జయిన మోటార్ సైకిల్ (సర్కిల్‌లో)

ప్రజా సేవలో.. నిబద్ధతతో ముందుకు సాగాలి

ఎస్పీ ఏ.ఆర్ దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్రజల సేవలో నిబద్ధతతో ముందుకు సాగాలని ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ పోలీసు అధికారులకు సూచించారు. బదిలీపై వెళ్తున్న ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్. దామోదర్‌కి ఆదివారం ఒంగోలు జిల్లా పోలీస్ కల్యాణ మండపంలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు, జిల్లా సబ్ డివిజనల్ డిఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అధికారులు, సిబ్బంది శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత 14 నెలల కాలంలో ప్రజలకు ఉత్తమ పోలీసింగ్ సేవలు అందించేందుకు అన్ని స్థాయిల్లోని అధికారులు, సిబ్బంది చూపిన నిబద్ధత అభినందనీయమైందన్నారు. ప్రకాశం జిల్లా నుంచి వెళ్లిపోతున్నప్పటికీ, ఈ జిల్లాలో పనిచేసిన అనుభవాన్ని, మీ అందరి సేవా తత్పరత ఎన్నటికీ మరవలేనని అన్నారు. పోలీస్ శాఖ ప్రతిష్ఠను కాపాడుతూ, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో మరింత నిబద్ధతతో పని చేస్తే, పోలీస్ శాఖపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని, తాను ఎక్కడ ఉన్నా ప్రకాశం జిల్లాతో ఉన్న అనుబంధం ఎప్పటికీ నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో పలువురు ఏఎస్పీలు, డిఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఇతర అధికారులు ఎస్పీ గారి సేవలను గుర్తుచేసుకుని అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కె.నాగేశ్వరరావు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కె.శ్రీనివాసరావు, ఒంగోలు డి.ఎస్.పి ఆర్. శ్రీనివాసరావు, దర్శి డిఎస్పి లక్ష్మీనారాయణ, కనిగిరి డిఎస్పి సాయి ఈశ్వర్ యశ్వంత్, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి రమణ కుమార్, ఏ ఆర్ డి ఎస్ పి కె. శ్రీనివాసరావు, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

వెంటాడుతున్న సోనా బోట్ల సమస్య..

(మొదటిపేజీ తరువాయి)

చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వం తమిళనాడు ప్రభుత్వంతో మాట్లాడితే తప్ప పరిష్కారం కాదని మత్స్యకారులు చెబుతున్నారు. పట్టించుకోవాల్సిన మత్స్యశాఖ అధికారులు పూర్తిస్థాయిలో పట్టించుకోకపోవడంతో పాటు ప్రభుత్వానికి సరైన నివేదిక ఇవ్వకపోవడం వల్లే ఈ సమస్య పెద్దదవుతోందని చెబుతున్నారు. మెరైన్ పోలీసులు కూడా ఈ సమస్య ఉంది అన్నప్పుడే స్పందిస్తున్నారు తప్ప మిగతా టైంలో ఆ కడలూరు నుంచి వచ్చే సోనా బోట్ల వేట నిలుపుదల చేసే ప్రయత్నాలు చేయడం లేదు. దీని వల్ల మత్స్యకారులకు తీవ్ర నష్టం జరుగుతున్నప్పటికీ అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో మత్స్యకారులే మూడు రోజుల నుంచి ఆ కడలూరు నుంచి వచ్చే సోనా బోట్ల కోసం సముద్రంలో ముమ్మరంగా గాలిస్తూ ఆ బోట్లు పట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకొని మత్స్యకారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వేడుకుంటున్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం: మంత్రి

ప్రజాశక్తి-టంగుటూరు

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇస్తుందని, సీఎంఆర్ఎఫ్‌తో పేదల ప్రాణాలు కాపాడుతున్నామని సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. మండలంలోని తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం మంత్రి స్వామి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మక్కెన వెంకటరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేస్తున్న మంత్రి స్వామి

వినతులు స్వీకరించిన మంత్రి

మండలంలోని తూర్పునాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో మంత్రి స్వామి ప్రజల నుంచి ఆదివారం వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలను పరిష్కరించారు. అనంతరం మంత్రి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ

డివైడర్‌ను ఢీకొన్న లారీ

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా లారీ డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంతో ఉలిక్కిపడిన డ్రైవర్ అప్రమత్తం కావడంతో ప్రాణ నష్టం తప్పింది. ఈ సంఘటన పెద్దదోర్నాల పట్టణంలో ఆదివారం తెల్లవారు జామున జరిగింది. మిర్చి లోడుతో ఎమ్మిగ నూరు నుంచి గుంటూరు వెళుతుండగా పెద్దదోర్నాలలోని గ్రోమోర్ వద్దకు వచ్చే సరికి డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకున్నాడు. లారీ ఐదు అడుగులు ముందు భాగం డివైడర్‌పైకి ఎక్కడంతో లారీ ముందు భాగం దెబ్బతింది. ఆ సమయంలో ప్రజలు పెద్దగా లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ఇదే డివైడర్ వద్ద అనేక ప్రమాదాలు జరిగాయి. సంబంధిత అధికారులు ప్రమాద హెచ్చరికలకు సంబంధించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-టంగుటూరు

జరుగుమల్లి మండలం కామేపల్లిలోని పోలేరమ్మ దేవాల యం వద్ద ఆదివారం వ్యక్తి కనిపించకపోవడంపై కుటుంబ స భ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నెల్లూ రు జిల్లా సంగం మండలం, సంగం గ్రామానికి చెందిన పెను మాది వెంకట రమణయ్య కుటుంబం కామేపల్లి పోలేరమ్మ ఆల యానికి పొంగళ్లు పెట్టుకోవడానికి వచ్చారు. దేవాలయ ఆవర ణంలో పొంగళ్లు కార్యక్రమం జరుగుతుండగా ఉదయం 9 గం టల ప్రాంతంలో కనిపించిన వారి కుటుంబ సభ్యుడైన యర్రం శెట్టి శ్రీనివాసులు తరువాత కనిపించలేదు. దీంతో కంగారు పడిన కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారందరికీ ఫో న్లు చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో ఆయన కుమా రుడు యర్రంశెట్టి రఘు జరుగుమల్లి పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేశారు. యర్రంశెట్టి శ్రీనివాసులు ఆచూకీ తెలిసిన వారు 9676943550 నెంబరులో సంప్రదించాలని కోరారు.

శ్రమకు తగ్గ ఫలితం సిఐటియు లక్ష్యం

జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్

ప్రజాశక్తి-పామూరు

కార్మికుల శ్రమకు తగ్గ ఫలితం సాధించటం సిఐటియు లక్ష్యమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ అన్నారు. ఆదివారం ఇరువురు రోడ్డులో షాదీఖానలో సిఐటియు ఎనిమిదో మహాసభ షేక్ అల్లాబక్ష అధ్యక్షతన జరిగింది. ముందుగా అమరవీరుల సంతాప సభ కే మాల్యాద్రి నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులు కర్షకులు అమాయక ప్రజలపై భారాలు మోపి కక్ష రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్మిక ఐక్యమై ఎనిమిది గంటల పని దినాన్ని సాధించుకున్నామని నరేంద్ర మోడీ పాలనలో 10 గంటలు పెంచేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. సంక్షేమ పథకాలపై కోత విధిస్తున్నరని ఆరోపించారు. ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు పరం చేస్తున్నారని దీనివల్ల కార్మికులకు తీవ్రమైన నష్టం వస్తుందని కార్మికులు ఐక్యమై వ్యతిరేక చట్టాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. గత వైసిపి ప్రభుత్వం అమలుపరిచిన విధానాలు కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందని అన్నారు. వేల కోట్లు విలువ చేసే భూమిని కార్పొరేట్ శక్తులకు తక్కువ ధరకు అమ్ముతున్నరన్నారు. సిఐటియు మాజీ జిల్లా నాయకులు సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ కార్మిక సమస్యలు ప్రభుత్వానికి ముడిపడి ఉన్నాయని వాటిని పరిష్కరించవలచినది ప్రభుత్వాలేనన్నారు. సిఐటియు నాయకులు స్థానిక సమస్యలపై పనిచేయాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు భూమి కావాలంటే వేల ఎకరాలు అప్పచెబుతున్నరు, పేదవాడు రెండు సెంట్లు భూమి అడిగితే లేదు అని ఆఫీసుల చుట్టూ తిప్పుకుంటున్నరని ఆయన ఆరోపించారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నాశనం చేశారని ఆరోపించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షమీ మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. నిత్యవసర వస్తువులు ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతోందన్నారు. ఆ మద్యంలోనే కూటమి ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమన్నారు. ఈ మహాసభలో వి.శ్రీను, సుబ్బమ్మ, చెన్నమ్మ, సుబరత్తమ్మ పాల్గొన్నారు. ఈ మహాసభలో 16 సంఘాలు సభ్యులు హాజరయ్యారని తెలిపారు.

పామూరులో మాట్లాడుతున్న ఎం.రమేష్

కనిగిరి: ఐక్య ఉద్యమాలకు కేంద్ర బిందువు సిఐటియు అని సిఐటియు జిల్లా కార్యదర్శులు జి.శ్రీనివాసులు, పిసి కేశవరావులు తెలిపారు. ఆదివారం కనిగిరి మండల సిఐటియు పదో మహాసభ స్థానిక సుందరయ్య భవనంలో ఎన్.పద్మ, వి.దేవదానం అధ్యక్షతన జరిగింది. సిఐటియు జెండాను ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు మాల్యాద్రి రెడ్డి ఎగురవేశారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు మీగడ వెంకటేశ్వర రెడ్డి ప్రారంభోపన్యాసాన్ని చేశారు. సిఐటియు ఆవిర్భావం, పోరాట పటిమ, విజయాలను వివరించారు. సంఘీభావ ఉపన్యాసాన్ని ఐద్వా నాయకులు ప్రసన్న, షమీల చేశారు. ఈ సందర్భంగా జి.శ్రీనివాసులు మాట్లాడుతూ గత 11 సంవత్సరాల నుంచి కేంద్రంలోని బిజెపి మోడీ, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా ప్రజా వ్యతిరేక పాలనను చేస్తున్నాయని, రాజ్యాంగానికి వ్యతిరేకంగా కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ పెట్టుబడిదారుల దోపిడీకి అండగా నిలుస్తున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నాయన్నారు. సమస్యల పరిష్కారం పోరాటంతోనే సాధ్యమవుతుందన్నారు.

కనిగిరిలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

సిఐటియు మండల కమిటీ కన్వీనర్‌గా నరేంద్ర

కనిగిరి మండల సిఐటియు నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కమిటీ కన్వీనర్‌గా పి.నరేంద్ర, కోకన్వీనర్‌గా సిహెచ్ ప్రసాద్, సభ్యులుగా పి.సీత, ఎన్.పద్మ, కొండమ్మ, రాజ్యలక్ష్మి, పి.రజిని, వి.దేవదానం, ఎస్కే వలి, సిహెచ్.అచ్చమ్మ, పీసీ కేశవరావు, ఎస్కే టోపీవలి, ఎం.ప్రమీల, ఆర్.ఏడుకొండలు, పి.సుబ్రహ్మణ్యం, యు.పిచ్చయ్య, రామ సుబ్బులు, శాంత కుమారి, జి.మల్లేశ్వరి, ఎం.శ్రీను, బి.ఆదిలక్ష్మి, సుజాత, ఎం.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. కార్మిక రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

నరేంద్ర, ప్రసాద్

ఏచూరి స్మారక వైద్యశిబిరానికి విశేష స్పందన

వైద్య శిబిరంలో ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - బాపట్ల

పార్లమెంటులో సిపిఎం పక్ష నేతగా ప్రజా సమస్యలపై గళమెత్తిన కామ్రేడ్ సీతారాం ఏచూరి కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేశారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ గంగయ్య అన్నారు. ఏచూరి వర్ధంతి సందర్భంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో ఉప్పరపాలెం సమీపంలో శారదాపురి కాలనీలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ప్రజాశక్తి విలేఖరి షేక్ మహబూబ్ సుభాని అధ్యక్షత వహించారు. సభలో గంగయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి కమ్యూనిస్టుగా విద్యార్థి ఉద్యమంతో ప్రారంభమై అంచలంచలుగా ఎదిగి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడిగా అనంతరం పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఆ క్రమంలో సిపిఎం అత్యంత ఉన్నతమైన అఖిలభారత కార్యదర్శిగా సమున్నత పాత్ర నిర్వహించిన ఏచూరి మరణం భారత కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని అన్నారు. పార్లమెంటులో రాజ్యసభ సభ్యునిగా రెండు దఫాలు పనిచేసి భారత దేశ విధివిధానాల నిర్ణయంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. సిపిఎం నాయకత్వంలో కొనసాగుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ఎన్నో తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొని పార్టీని ముందుకు నడిపారని అన్నారు. ఆయన ఆశయాలు ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఉచిత వైద్య శిబిరంలో శారదపు కాలనీ, ఉప్పరపాలెం, రైలుపేట ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రజలకు డాక్టర్ సిద్ధార్థ, డాక్టర్ మధుబాబు, డాక్టర్ సునీత వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాశక్తి జిల్లా విలేఖరి ఎన్ జయప్రకాష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జడ వినయ్ కుమార్, అడుగుల శ్రీనివాసరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి కొండయ్య, సిఐటియు నాయకుడు తిరుమలరెడ్డి, శరత్, కుమార్ జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు వై భాస్కరరావు, కె నాగేశ్వరరావు, దినేష్, లలిత, కిరణ్మయి, ఆసోది రంగారెడ్డి పాల్గొన్నారు.

ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

లౌకిక విలువల కోసం పోరాడాలి..

సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య

ప్రజాశక్తి - చీరాల

లౌకిక విలువల కోసం పోరాడటమే సీతారాం ఏచూరికి మన మిచ్చే ఘన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. పట్టణంలో ఆదివారం జరిగిన సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజం, సామాజిక న్యాయం, సమానత్వం, సోషలిజంపై తీవ్రమైన దాడి బిజెపి, ఆర్ఎస్ఎస్ చేస్తున్న తరుణంలో దాన్ని ఎదిరించి పోరాడే శక్తులను ఐక్యం చేసి ముందుకు తీసుకెళ్లడంలో సీతారాం ఏచూరిది అసాధారణమైన పాత్రని అన్నారు. ఇప్పుడు ఆయన మన మధ్య లేకపోయినా ఆ ఒరవడిని మరింత పటిష్టంగా ముందుకు తీసుకు పోవాల్సిన అవసరం ఉందని అన్నారు. భారతీయ భావనను తరతరాల చరిత్ర తీర్చిదిద్దిందని అన్నారు. 'భిన్నత్వంలో ఏకత్వం' భారతీయ భావనని అన్నారు. ఎన్నో మతాలు, భాషలు, మాండలిక, ప్రాంతీయ వ్యత్యాసాలు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, వేషభాషలు, ఆహారపు అలవాట్లు, పండగలు, పబ్బాలు, పెండ్లి పద్ధతులు, తెగలు, కులాల జీవన పద్ధతులు కలగలిసి జీవించే కోట్లాది ప్రజలున్న దేశం మనదని అన్నారు. దేశ సమైక్యత కాపాడుకో వాలని అన్నారు. సభకు సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి ఎన్ బాబురావు అధ్యక్షత వహిం చారు. సభలో సిపిఐ నాయకులు బత్తుల శ్యామ్యూల్, చేనేత జన సమాఖ్య నాయకులు మాచర్ల మోహనరావు, బలహీన వర్గాల సమాఖ్య నాయకులు గోసాల ఆశీర్వాధం, బిసి ఫెడరేషన్ నాయకులు వుటుకూరి వెంకటేశ్వర్లు, హేతు వాద సంఘం నాయకులు సింహాద్రి ఎల్లమందారెడ్డి, సిపిఎం నాయకులు ఎం వసంతరావు, డి నారపరెడ్డి, ఇనగాల వరప్రసాద్, శ్రీను, సిఐటియు నాయకులు ఇమ్మానియెల్ పాల్గొన్నారు.

ఏచూరి వర్ధంతి సభలో మాట్లాడుతున్న గంగయ్య

విద్యారంగ సమస్యలపై యుటిఎఫ్ రణభేరి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఆర్థిక, విద్యా రంగ సమస్యలు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) సెప్టెంబర్ 15 నుండి 19 వరకు చేస్తున్న రణభేరి కార్యక్రమాన్ని ఉద్యోగులు, ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు పి రామాంజనేయులు, కందిమళ్ళ రవి బాబు కోరారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దీర్ఘకాలంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్య లను కూటమి ప్రభుత్వం పరిష్కరించలేక పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. 12వ పిఆర్సి కమిషనర్ వెంటనే నియమించాలని, బోధనేతర పనుల నుండి ఉపాధ్యాయులకు విముక్తి కలిగించాలని కోరారు. డిఏలు విడుదల చేసి బకాయిలు వెంటనే చెల్లించాలని అన్నారు. ఉమ్మడి సర్వీసు రూల్స్ ద్వారా ప్రమోషన్లు కల్పించాలనే డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 25న విజయవాడలో జరిగే బహిరంగ సభలో ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం రణభేరి పోస్టర్‌ను యుటిఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుదాస్, యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ డైరెక్టర్ పోపూరి సునీల్ కుమార్, గరిమిడి శ్రీనివాస్, జిలాని, కొండా నాయక్, రమణమూర్తి, వేణుబాబు పాల్గొన్నారు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

రోటరీ సేవలకు పురస్కారం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నూతన సభ్యులను చేర్చుకోవడంలో విశేష కృషి చేసినందుకు ప్రతిష్టాత్మకమైన మెంబర్ షిప్ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. రోటరీ ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లో జరిగిన మెంబర్ షిప్ మీటింగులో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు మాదాల సాంబశివరావు, చెరుకూరి నాగేశ్వరరావు ఈ పురస్కారం అందుకున్నారు. మార్టూరు రోటరీ క్లబ్ ఈ సర్టిఫికెట్ అందుకోవడం పట్ల ఎఫర్ట్ చైర్మన్ జాష్టి వెంకట మోహనరావు అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ రావి అంకమ్మ చౌదరి, కొర్రపాటి కాజారావు, నూతన సభ్యులు సాదినేని రంగారావు, జి తిరుపతయ్య పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న రోటరీ ప్రతినిధులు

సిఎం సహాయనిది చెక్కు అంద చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

ప్రజాశక్తి - చీరాల

నిరుపేదలకు సీఎం సహాయనిధి వరం లాంటిదని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు ఆయన సహకారంతో సీఎం సహాయ నిధి ద్వారా 120 మంది లబ్ధిదారులకు రూ.1.2కోట్ల విలువైన చెక్కులను తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ కొంత మంది అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందాల్సి వస్తుందని అన్నారు. అలాంటి బాధితులు చేసిన ఖర్చును సిఎం సహాయనిధి ద్వారా భర్తీ చేయడం ప్రభుత్వం చేస్తున్న గొప్ప సేవని అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే సిఎం చంద్రబాబు ప్రధాన లక్ష్యమని అన్నారు. అందుకే ప్రతి ఒక్కరికీ ఆర్థిక అండగా సీఎం సహాయ నిధి అందుబాటులో ఉంచారని చెప్పారు. బాధితుల కుటుంబాలకు ఇది ఆపన్నహస్తమని లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. వైద్యసేవలు మరింత విస్తృతం చేయడమే కాకుండా పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక అండగా నిలుస్తున్న సిఎం సేవలు ప్రశంసనీయమని అన్నారు. వైద్యం కోసం పేదలు ఇబ్బంది పడాల్సిన పనిలేదని అన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించడంతోపాటు కార్పొరేట్ వైద్యం పేదలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఐటియు జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

సిఐటియు మండల కన్వీనర్‌గా రవీంద్రబాబు

ప్రజాశక్తి - మేదరమెట్ల

సిఐటియు కొరిశపాడు మండల 3వ మహాసభ రావినూతలలో ఆదివారం నిర్వహించారు. సిఐటియు మండల కన్వీనర్‌గా వై రవీంద్రబాబు, కో కన్వీనర్‌గా రెబ్బవరపు చైతన్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం ఆంజనేయులు మాట్లాడారు. సిఐటియు ద్వారా ఎన్నో ఉద్యమాలు నడిపామని, తద్వారా ఎన్నో విజయాలు సాధించామని అన్నారు. అంగన్‌వాడి, ఆశా కార్యకర్తలు, పారిశుద్ధ కార్మికులు వంటి వారంతా ట్రేడ్ యూనియన్ పరిధిలోనే ఉన్నారని అన్నారు. రాబోయే కాలంలో ఐక్యతతో సమస్యలపై పోరాటాన్ని సాగిస్తే విజయాలు వస్తాయని అన్నారు. కమిటీలో కొండ్రు సురేష్, పాలపర్తి దుర్గా, కంచర్ల హరిబాబు, గుర్రాల లక్ష్మి, ఆలేరు పద్మ, నక్కల రాణి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిపిఎం అద్దంకి కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, ప్రజా నాట్య మండలి పూర్వ గౌరవ అధ్యక్షులు బొంతు దశరథ, సిఐటియు పూర్వ కన్వీనర్ ఎం వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఉల్లిపాలయ విక్రయాలు ప్రారంభిస్తున్న శివప్రసాద్

మార్కెట్ యార్డులో 'ఉల్లి' విక్రయం

ప్రజాశక్తి - రేపల్లె

స్థానిక మార్కెట్ యార్డులో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉల్లిపాయలు విక్రయిస్తున్నట్లు అనగాని శివప్రసాద్ తెలిపారు. మార్కెట్ యార్డులో ఆదివారం జరిగిన సంతలో రూ.100కు 7కిలోల ఉల్లిపాయలు ప్రజలకు అందించారు. పెద్ద సంఖ్యలో మార్కెట్‌కు వచ్చిన వినియోగదారులు ఉల్లిపాయలు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో మత్తి భాస్కర్ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో వైద్య శిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం

మెగా కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. వైద్య శిభిరంలో 637 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 248 మంది కంటి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించారు. శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, గ్రీన్ పార్క్ ఫౌండేషన్, నోవా అగ్రిటెక్ లిమిటెడ్, జిల్లా ఆందత్వ నివారణ సంస్థ, గుంటూరు పెద్దకాకాని శంకర్ నేత్ర వైద్యశాల సౌజన్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజారోగ్యం కొరకు గత కొన్నేళ్లుగా ఈ మెగా వైద్య కంటి శిబిరం నిర్వహిస్తున్నట్లు క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పర్చూరు ఎఎంసి చైర్మన్ గుంజి వెంకట్రావు, టిడిపి మండల అధ్యక్షులు నాయుడు హనుమంతురావు, వాణిజ్య విభాగపు కార్యదర్శి పాలేరు రామకృష్ణ, ఇంకొల్లు గ్రామ అధ్యక్షులు వలేరు మార్కు, పిఎసిఎస్ అధ్యక్షులు కలిసి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి

- కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాకు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అన్ని శాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగుల సహకారంతో జిల్లాను అభివద్ధి పథంలో నడిపేందుకు కషి చేశానని పూర్వ కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలో కలెక్టర్‌గా పనిచేసి గుంటూరు జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళుతున్న తమీమ్ అన్సారియాకు జిల్లా అధికార యంత్రాంగం ఘన వీడ్కోలు పలికింది. ఒంగోలు రిమ్స్ ఆడిటోరియంలో ఆదివారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఆమెతో కలిసి పనిచేసిన అనుభవాలను, తమకు దిశానిర్దేశం చేసిన సంగతులను ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా తమీమ్ అన్సారియా మాట్లాడుతూ గత ఏడాది జూన్ 27న ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తాను, విస్తతంగా క్షేత్రస్థాయి పర్యటనలు చేయడం ద్వారా జిల్లాలోని పరిస్థితిపై స్పష్టమైన అవగాహన వచ్చిందన్నారు. ఈ క్రమంలోనే బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఎక్కువగా ఉన్న ప్రకాశం జిల్లాలో స్వచ్ఛంద సంస్థలతోపాటు వివిధ వర్గాలను భాగస్వాములను చేయటంతో బాల్యవివాహాలు, వెట్టి చాకిరీని నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నీటి సంరక్షణ చర్యలలో భాగంగా డ్వామా ఆధ్వర్యంలో చేపట్టిన పనులకు ప్రకాశం జిల్లాకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించిన విషయాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. జిల్లాలో 14 నెలలకు పైగా కలెక్టర్‌గా పనిచేసిన కాలంలో ఇదే విధానాన్ని తాను అనుసరించానని తెలిపారు. అనంతరం వివిధ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది, ఉద్యోగ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అన్సారియాను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాలకష్ణ, డిఆర్ఓ బి.చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మీ ప్రసన్న, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, పలు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఫౌండేషన్ సభ్యులు, వైద్యులు

300 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి మద్దిపాడు

మండల పరిధిలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో ఇనమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. యేనుముల వెంకటరామిరెడ్డి ఇంటి వద్ద బాలకోటి రెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ నేతత్వంలో ఈ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్లు డాక్టర్ ఉమాపతి చౌదరి, ప్రముఖ వైద్యులు డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ అనీల్ కుమార్, డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి నెలరోజుల పాటు ఉచిత ఒపి, నిర్ణీత పరీక్షలపై రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. సాధారణ, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ఉపాస్ హార్ట్ కేర్ సెంటర్లో ఎన్టీఆర్ వైద్య సేవ, ఇహెచ్‌ఎస్ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో 300 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, పిఎఫ్‌టి, దంత వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యేనుముల సుధాకర్ రెడ్డి, ఎంవి.రామిరెడ్డి (రాంకి ఫౌండేషన్), బి. బ్రహ్మానందరెడ్డి, పుల్లారెడ్డి, ఎముకలు కీళ్ళ, జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ గోనుగుంట్ల శ్రీనివాస్, డయాబెటాలాజిస్ట్, సాధారణ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.రాధ, ప్రసూతి, స్త్రీ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ టి.మురళీకష్ణారెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మందపల్లి శ్రీనివాసరావు, గ్రామ ప్రముఖులు గంగిరెడ్డి, శేషి రెడ్డి, కోటిరెడ్డి, అరుణ, ఏడుకొండలు, ఉపాస్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ ఆనంద్ కుమార్, విఆర్ఒ రాము పోలినేని, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

రజక వృత్తిదారులకు

సామాజిక రక్షణ చట్టం అమలు చేయాలి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

రజక వత్తిదారులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులను అరికట్టాలంటే సామాజిక రక్షణ చట్టాన్ని ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ప్రకాశం జిల్లా రజక వత్తిదారుల సంఘం డిమాండ్ చేసింది. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో భూపోరాట యోధురాలు ఐలమ్మ, విద్యుత్ పోరాట యోధుడు సత్తెనపల్లి రామకష్ణ వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు టి.రాము ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో తొలుత ఐలమ్మ, రామకృష్ణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి రాయల మాలకొండయ్య మాట్లాడుతూ భూస్వామ్య దోపిడికి ఎదురొడ్డి రైతు, కార్మిక హక్కుల కోసం పోరాడిన వీరనారి ఐలమ్మ చరిత్ర ప్రజా పోరాటాలకు స్ఫూర్తినిస్తుందన్నారు. ఆమె పోరాట బాటలో పుచ్చలపల్లి సుందరయ్య లాంటి మహానేతలు నిలిచారన్నారు. ఆ స్ఫూర్తితోనే ఈనాటికీ ఉద్యమాలు కొనసాగుతున్నాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా కూడా గ్రామాల్లో భూకబ్జాలు, అక్రమ కేసులు పెరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లా కొత్తవలసలో ఓ రైతు ప్రాణాలు కోల్పోవడం ఇందుకు ఉదాహరణ అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సామాజిక రక్షణ చట్టం ఎంతో అవసరమని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు టంగుటూరి రాము మాట్లాడుతూ 2000లో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా బషీరాబాగ్‌లో చేపట్టిన భారీ ఆందోళనలో సత్తెనపల్లి రామకష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి ప్రాణాలు అర్పించారన్నారు వారి ఉద్యమ స్ఫూర్తితో రాబోయే రోజుల్లో మరింత బలమైన పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ భూములను కార్పొరేట్లకు అప్పగించడం ఆపాలన్నారు. రజక వత్తిదారుల సమస్యలను పరిష్కరించాలన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు ఆవులమంద రమణమ్మ, కష్ణయ్య, చీమకుర్తి కోటేశ్వరరావు, అపార్ట్‌మెంట్ కంస్యూమర్స్ సంఘం అధ్యక్షుడు చందలూరు శ్రీనివాసులు, కార్యదర్శి మంచికలపాటి శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు యోగమ్మ, కసునూరి శ్రీనివాసులు, బొప్పరాజు హరిబాబు, రాయళ్ల కాశయ్య, గోపాల్, రఘు బాబు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న రజక వృత్తిదారుల సంఘం నాయకులు

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె. శ్రీనివాసరావు

'రణభేరి' బైకు యాత్రను జయప్రద్రం చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలు, ఆర్థిక సమస్యలపై అవగాహన కల్పించేందుకు యుటిఎఫ్ రణభేరి బైకు యాత్రను ఈనెల 15 నుంచి 19 వరకూ నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు తెలిపారు. యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి బయలుదేరిన ఈ యాత్ర విజయవాడలో ముగుస్తుందన్నారు. ప్రకాశం జిల్లాలో ఉపాధ్యాయులందరూ ఉత్సాహంగా పాల్గొని యాత్రను విజయవంతం చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు మాట్లాడుతూ రణభేరి బైకు యాత్ర ఈ నెల 18న మధ్యాహ్నం కనిగిరిలోకి ప్రవేశించి గిద్దలూరు, బి.పేట, కంభం, మార్కాపురం, పొదిలి, దర్శి, చీమకుర్తి మీదుగా 19వ తేదీ సాయంత్రం ఒంగోలుకు చేరుకుంటుందని తెలిపారు. ఆయా కేంద్రాల్లో ఉపాధ్యాయులంతా పాల్గొని యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై మాట్లాడుతూ 2003 డిఎస్‌పి ఉపాధ్యాయులకు మెమో నం.57 ప్రకారం పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలన్నారు. ఇటీవల మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఒవి. వీరారెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.రవి, జిల్లా సహాధ్యక్షురాలు జి. ఉమామహేశ్వరి, జిల్లా కోశాధికారి ఎన్. చిన్నస్వామి, జిల్లా కార్యదర్శి ఎం.సత్యనారాయణ రెడ్డి, పి. బాల వెంకటేశ్వర్లు, ఎం. సంధ్యారాణి, ఎం. రాము, కె. వెంకయ్య, టి. రాజశేఖర్, ఎం. శ్రీను, పి. వెంకటేశ్వర్లు, కె. లక్ష్మీనారాయణ, ఎ. పోతులూరయ్య, నారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎస్‌పి దామోదర్‌కు వీడ్కోలు పలుకుతన్న అధికారులు

ఎస్‌పి దామోదర్‌కు వీడ్కోలు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ప్రకాశం జిల్లా ఎస్‌పిగా పనిచేసి విజయనగరం జిల్లా జిల్లాకు బదిలీపై వెళ్తున్న వెళుతున్న ఎస్‌పి ఎఆర్. దామోదర్‌కు పోలీసు అధికారులు మరియు సిబ్బంది ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. తొలుత పెరేడ్ నిర్వహించి ఎస్‌పిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎస్‌పి దామోదర్ పెరేడ్ కమాండర్ నుంచి గౌరవవందనం స్వీకరించారు. పెరేడ్ పరిశీలన అనంతరం ప్లటూన్‌ల వారీగా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి వారి నుంచి ఆత్మీయ వీడ్కోలు తీసుకున్నారు. అనంతరం పోలీసు కవాతు వాహనం లో పెరేడ్ గ్రాండ్ నంచి ఛాంబర్ వరకు ఎస్‌పిని ఓపెన్ టాప్ జీపు పై ఊరేగించి పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఎస్‌పి దామోదర్ మాట్లాడుతూ గత 14 నెలలు కాలంలో చేపట్టిన ప్రతి కార్యక్రమానికి పోలీస్ అధికారులు, సిబ్బంది అందించిన సహకారం అభినందనీయమన్నారు. బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లా నుంచి వెళుతున్నప్పటికీ అందరి సేవలను ఎన్నడూ మరువలేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ కె.నాగేశ్వరరావు, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి కె.శ్రీనివాసరావు, ఒంగోలు డిఎస్‌పి ఆర్. శ్రీనివాసరావు, దర్శి డిఎస్‌పి లక్ష్మీనారాయణ, కనిగిరి డిఎస్‌పి సాయి ఈశ్వర్ యశ్వంత్, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి రమణ కుమార్, ఎఆర్ డిఎస్‌పి కె. శ్రీనివాసరావు, సిఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌పి హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని ఎస్‌పి వి. హర్షవర్ధన్ రాజు తెలిపారు. ప్రకాశం జిల్లా ఎస్‌పిగా వి. హర్షవర్ధన్ రాజు ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌పిని ఎఎస్‌పి (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఎఆర్ అదనపు ఎస్‌పి కె. శ్రీనివాసరావు, డిఎస్‌పిలు, సిఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రఖ్యాత స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు పేరు ఈ జిల్లాకు ఉండటం అదష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ప్రకాశం జిల్లాకు ప్రత్యేకమైన గౌరవం, మంచి పేరు ఉందన్నారు. ఆ పేరుకు మరింత పెరిగేలా కషి చేస్తానని తెలిపారు. ప్రజలకు అంకితభావంతో సేవలు అందిస్తామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. మహిళల భద్రత, వారి రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తామ తెలిపారు. శక్తి యాప్‌పై మరింత విస్తతంగా అవగాహన కల్పించి, ప్రతి మహిళ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపదసమయాల్లో సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దష్టి సారిస్తామన్నారు. జిల్లాలో శాంతి భద్రత పరిరక్షణ, నేరాల నియంత్రణ విషయంలో రాజీ పడబోమని తెలిపార. అసాంఘిక కార్యకలాపాలను అరికడతామని తెలిపారు. పోలీస్ సిబ్బంది సంక్షేమాన్ని దష్టిలో ఉంచుకొని కార్యాచరణలు రూపొందిస్తూ, నూతన ప్రణాళికలను అమలు చేస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని విధాల చర్యలు తీసు కుంటామన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రకాశం జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్ రాజు

వరదలు ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధం

- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు
- కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశం

ప్రజాశక్తి - కొల్లూరు

జిల్లాలో అనుకోని పరిస్థితిలో వరదలు వస్తే ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో రేపల్లె ఆర్‌డిఒ ఎస్ రామలక్ష్మి, డిపిఒ ప్రభాకర్‌తో కలిసి కృష్ణ నది వరదల సన్నద్ధతపై జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదలు వస్తే ఎలాంటి సమస్యలు వస్తాయని ముందుగానే అంచనాలు వేసుకొని దానికి తగినట్లుగా అధికారులు పనిచేయాలని అన్నారు. కృష్ణానది పరివాహక

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రాంతంలోని లంక గ్రామాల్లో బోట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పరివాహక ప్రాంతంలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు బోట్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. త్రాగునీరు, భోజన ఏర్పాట్లు సకాలంలో అందజేయడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. ప్రజలెవరు అధైర్య పడవలసిన అవసరం లేదని అన్నారు. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి అధికారి వరకు వరదల సమాచారాన్ని వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. గతేడాది వచ్చిన వరదలు అంచనా వేసుకొని ఇప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలనిఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కృష్ణ నది వరదలు వస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలని కీలకమైన శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులకు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. అంతకు ముందు కృష్ణా నది వారధిపై నుంచి కృష్ణ నది నీటి ప్రవాహాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. సమావేశంలో విద్యుత్, పోలీసు, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్య, శాఖ అధికారులు, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె తహశీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

షేరు శ్రీనివాసరావు అభినందిస్తున్న వెంకటరమణారావు

మత్స్యకార సంక్షేమ సంఘాల అధ్యక్షునిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

సాంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమైక్య ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షునిగా మండలంలోని పల్లెకోన గ్రామానికి చెందిన లాయరు సేరు శ్రీనివాసరావు నియమితులయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఎన్ అర్జునరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ ముత్యాలు ప్రకటించారు. శ్రీనివాస్ నియామకం పట్ల మాజీ రాజ్యసభ సభ్యులు, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణరావు, మంత్రి కొల్లు రవీంద్ర దుశాలువాతో సత్కరించి అభినందించారు. తన నియమాగానికి కృషి చేసిన మంత్రి రవీంద్ర, మోపిదేవి వెంకటరమణారావుకు లాయర్ శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేస్తున్న వైసిపి నాయకులు

వైసీపీ నాయకులు బ్రహ్మం మృతి

ప్రజాశక్తి - పర్చూరు

మేదర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ శిరిగిరి పద్మావతి భర్త, వైసీపీ సీనియర్ నాయకులు శిరిగిరి బ్రహ్మం (70) ఆదివారం మృతి చెందారు. పర్చూరులోని ఆయన స్వగృహంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల వైసీపీ ఇంచార్జి గాదె మధుసూదనరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మధుసూదనరెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ మండల కన్వీనర్ కఠారి అప్పారావు, ఇతర నాయకులతో కలిసి మృతుని కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయనకు ఒక కుమార్తె ఉన్నారు. నివాళులు అర్పించిన వారిలో రొటేరియన్ కోట శ్రీనివాసరావు, పర్చూరు సర్పంచ్ మల్లా అంజమ్మ, మాజీ అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్ యద్దనపూడి హరిప్రసాద్, సీనియర్ నాయకులు మల్లా శ్రీనివాసరావు, కంచనపల్లి రమేష్, పేర్ని హరి పాల్గొన్నారు.

బిఎస్‌పి నూతన కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి - వేటపాలెం

బిఎస్‌పి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని బిఎస్‌పి నియోజకవర్గ ఇంచార్జ్ చిట్టిమాల సంగీతరావు తెలిపారు. మండలంలోని పందిళ్ళపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన సమావేశంలో బిఎస్‌పి మండల నూతన కార్యవర్గ ఎంపిక నిర్వహించినట్లు తెలిపారు ఇన్చార్జిగా కటారి అంకమ్మ, కొర్నెపాటి పృథ్వి, అధ్యక్షుడులు సహీన, ఉపాధ్యక్షులు అద్దంకి ఆదిలక్ష్మి, కార్యదర్శి కటారి వెంకటేష్, కోశాధికారి తేళ్ల సామ్యేల్, కన్వీనర్ పాదర్తి స్వాము లు, కో కన్వీనర్ ద్రాక్షపల్లి సాంబయ్య ఎంపికైనట్లు తెలిపారు.

17న విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలో విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17న భగవాన్ విశ్వకర్మ జయంతిని జయప్రదం చేయాలని విశ్వ బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు మచ్చా వెంకటేశ్వర్లు కోరారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘ గౌరవ అధ్యక్షులు తక్కెళ్ళపాటి రామకృష్ణ , కార్యదర్శి తక్కెళ్ళ పాటి నాగేంద్రప్రసాద్, ట్రెజరర్ రావినూతల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కాజన అప్పయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ముండ్లమూరు

మండలంలోని మారెళ్ళ గ్రామంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం అత్యంత వైభవంగా ఆదివారం నిర్వహించారు. 1995 – 2000లలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఒక చోట చేరి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఒకరిని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పట్లో తాము చదువుకున్న పాఠశాల దగ్గరకు చేరి ఒకరినొకరు పరిచయం చేసుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకున్నారు. తరగతిలో చేసిన పనులు, అల్లరి గుర్తుకు తెచ్చుకున్నారు. 25ఏళ్ల తరువాత ఒకచోట కలవడం ఎంతో ఆనందంగా ఉందని వ్యక్తం చేశారు. 10వ తరగతి తర్వాత విడిపోయిన విద్యార్థులు మరల కలవాలనే తలపుతో అనిల్, బాలకృష్ణ, వెంకటరెడ్డి, వీరాంజనేయులు వాట్సాప్ గ్రూప్ తయారు చేశారు. అందులో చదువుకున్న విద్యార్థుల ఫోన్ నెంబర్లు సేకరించి యాడ్ చేశారు. అందరం ఒకచోట చేరదామని నిర్ణయించుకున్నారు. ఆదివారం వేదికైంది. అప్పటి ప్రధానోపాధ్యాయులు పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి మాట్లాడుతూ నాటి విద్యార్థులు అందరూ

25ఏళ్ల తర్వాత ఒక చోట చేరిన నాటి విద్యార్థులు

ఒక చోటు చేరి విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయును పిలిచి సన్మానించడం సంతోషదాయకమని అన్నారు. పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతోమంది ఉన్నత శిఖరాలు అధిరోహించారని గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు రంగారావు, వెంకటేశ్వర్లు, కోటేశ్వర రావు, పిఈటి సుబ్బారావు, పాశం కృష్ణయ్య, ప్రస్తుత ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాసరావు పూల మాల వేసి శాలువా కప్పి జ్ఞాపక అందజేసి సత్కరించారు. రూ.30 వేల విలువచేసే సామాగ్రి పాఠశాలకు అందజేశారు. అనంతరం సాంస్కృతి కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించారు.

బీపీ, షుగర్ వ్యాధులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - రేపల్లె

ప్రస్తుత ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిళ్లు, ఉరుకుల పరుగుల జీవనశైలిలో బీపీ, షుగర్ వ్యాధులు సర్వ సాధారణం అయ్యాయని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ గోపాలం శివన్నారాయణ అన్నారు. జీవిఆర్ ఫౌండేషన్ సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సంజీవని హాస్పిటల్‌లో రెగ్యులర్ మెడికల్ క్యాంపు ఆదివారం నిర్వహించారు. ఈ క్యాంపులో జనరల్ మెడిసిన్ డాక్టర్ సాయి దుర్గ, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ అనూష, పిల్లల వైద్యులు డాక్టర్ వసంత వీర రాఘవయ్య వైద్య పరీక్షలు చేశారు. బీపీ షుగర్ వ్యాధి గ్రస్తులకు రెగ్యులర్ మెడికల్ క్యాంపు నిర్వహించి రోగులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వీర రాఘవయ్య మాట్లాడుతూ

మెడికల్ క్యాంపులో పరీక్షలు చేస్తున్న వైద్యులు

జీవనశైలిలో బీపీ, షుగర్ వ్యాధులు సర్వ సాధారణం అయ్యాయని అన్నారు. 125 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. రెడ్ క్రాస్ కమిటీ సభ్యులు కరిముల్లా, ధూళిపాళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచార కేంద్రం గుర్తుందా?

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో కొన్నేళ్ల క్రితం ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల సౌకర్యం కొరకు సిబ్బందిని ఏర్పాటు చేసి సమాచార కేంద్రాన్ని కొనసాగించారు. ఆర్టీసీలో పని చేసిన విశ్రాంతి ఉద్యోగులను కేటాయించి వారి ద్వారా వెళ్లు బస్సుల సమాచారం మైకు ద్వారా ప్రయాణికులకు ప్రచారం చేసేవారు. డ్రైవర్లు, కండక్టర్లు ఈ సమాచార కేంద్రంలో రాకపోకల సమయాన్ని నిర్ధారిస్తూ సంతకాలు చేసేవారు. అలాంటి ప్రాధాన్యత కలిగిన ఈ సమాచార కేంద్రాన్ని

ఆర్టీసీ వారి సమాచార కేంద్రం

ఆర్టీసీ అధికారులు పెరిగిన టెక్నాలజీకి అనుగుణంగా సిబ్బందిని ఎత్తివేసి కేంద్రాన్ని మాత్రం ఆర్టీసీ ప్రాంగణానికి తరలించడం మరిచారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ కేంద్రాన్ని ఆర్టీసీ అధికారులు నిరుపయోగంగా పొదిలి వేయడంతో దీనిపై కొందరు వ్యక్తులు కన్నేశారు. దీనిని ఇతర అవసరాలకు వినియోగించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఆర్టీసీకి చెందిన ఈ కేంద్రాన్ని తక్షణమే స్పందించి ఆర్టీసీ ప్రాంగణానికి తరలించకుని అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరుతున్నారు.

వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి అద్దంకి

వేరు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. బైక్ అదుపుతప్పి కింద పడిన ఘటనలో ఒకరికి గాయాలు కాగా బైకు ఆటోను ఢీకొన్న ఘటనలో మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. బైకును లారీ ఢీకొన్న ప్రమాదంలో మరొకరికి గాయాలైన ఘటనలు శనివారం పట్టణంలోని భవాని సెంటర్, రానగర్ జంక్షన్, రాజీవ్ కాలనీ జంక్షన్ ఆదివారం జరిగాయి. మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ మేదరమెట్ల గ్రామానికి చెందిన వడ్డమూడి వెంకటేశ్వరరావు అదుపుతప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే ఆయనను 108 వాహనంలో ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతివేగంతో మార్కెట్ యార్డ్ వద్ద ఆటోను బైక్ ఢీ కొనడంతో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భవాని సెంటర్లు ఐదు రోడ్లు కూడలి కావడంతో ట్రాఫిక్ నియంత్రణ పోలీసులు చేస్తున్నప్పటికీ వాహనాల అధికంగా రావడంతో లారీ ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో యువకుడికి గాయాలయ్యాయి. వెంటనే వైద్యశాలకు తరలించారు.

21న గంగవరంలో మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి - పంగులూరు

ఇంకొల్లు మండలం గంగవరంలో ఈనెల 21న ఆదివారం మెడికల్ క్యాంపు జరుగుతుందని క్యాంపు కన్వీనర్ కె బాలచందర్ ఆదివారం పంగులూరు వచ్చిన సందర్భంగా తెలిపారు. ఈనెల 14న జరగవలసిన మెడికల్ క్యాంపు అనివార్య కారణం వలన 21కి మార్చినట్లు తెలిపారు. పేషెంట్లు ఈ మార్పును గమనించాలని కోరారు. డాక్టర్ మంచాల రమేష్ కుమార్, డాక్టర్ మంచాల విద్యా, డాక్టర్ అన్నంరాజు సాంబయ్య వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ క్యాంపుకు డాక్టర్ వలేటి కాంతారావు ధర్మపత్ని పద్మావతి పేర్లు మీద వారి కుటుంబ సభ్యులు వలేటి మోహన్రావు, ఆదిశేషమ్మ, కుటుంబ సభ్యులు సహకారాన్ని అందిస్తున్నారని చెప్పారు. గంగవరం పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేటి నుండి గాలికుంటు నివారణ టీకాలు

ప్రజాశక్తి - అద్దంకి

అద్దంకి, కొరిశపాడు మండలాల పరిధిలోని పశు పోషకులకు తప్పనిసరిగా నేటి నుండి వచ్చేనెల 15వరకు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించుకోవాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు బ్రహ్మయ్య కోరారు. సిబ్బంది మీ ఇళ్లకు వచ్చినపుడు సహకరించి పశువులకు టీకాలు వేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ టీకాల వలన జ్వరం రావడం, పాలు తగ్గడం లాంటివి ఉండవని తెలిపారు.

ప్రజాశక్తి
సోమవారం 15 సెప్టెంబర్ 2025

శిథిలావస్థకు చేరిన ఉర్దూ రేంజ్ కార్యాలయం

శిథిలావస్థకు చేరిన ఉర్దూరేంజ్ కార్యాలయ పెంకుటిల్లు

ప్రజాశక్తి - బాపట్ల

ఉర్దూ భాష అభివృద్ధికి ప్రభుత్వం నిర్దిష్టమైన ఆలోచన చేస్తున్నప్పటికీ అనేక ప్రాంతాల్లో ఈ భాషపై ఆశించిన స్థాయిలో ఫలితాలు రావటం లేదు. ఉర్దూ భాష కోసం ప్రాథమిక స్థాయిలో జిల్లాలో 97 పాఠశాలలు ఉన్నాయి. రెండు వేలకు పైగా విద్యార్థులు ఉర్దూ అభ్యసిస్తున్నారు. ప్రాథమిక విద్య అనంతరం ఉన్నత పాఠశాలల్లో చేరేందుకు అవకాశాలు లేకపోవడంతో ఉర్దూ భాషాభివృద్ధి ప్రాథమిక స్థాయిలోనే కుంటుపడిపోతుందని ఆవేదన వ్యక్తం అవుతుంది. ఉన్నత పాఠశాలల్లో కూడా ఉర్దూ ఉంటేనే విద్యార్థులకు వెసులుబాటు ఉంటుంది. ప్రాథమిక విద్య అనంతరం ఉర్దూ కొనసాగించేందుకు ఉర్దూ లేకపోవడంతో విద్యార్థులు వేరే సబ్జెక్టులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. జిల్లాలోని 25 మండలాలతో పాటు ముస్లిం జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఉర్దూ విద్యా బోధన జరుగుతుంది. జిల్లాలోని బాపట్ల, భట్టిప్రోలు, రేపల్లె, కనకాల, అప్పికట్ల, చందోలు, నదిముల్లాయపాలెం, కర్లపాలెం ప్రాంతాల్లో ఉర్దూ పాఠశాలలు నడుస్తున్నాయి. ఉర్దూ విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. ఉర్దూను రెండవ అధికార భాషగా ప్రకటించినప్పటికీ ప్రభుత్వ కార్యాచరణ లేకపోవడంతో భాష పట్టు కోల్పోతుంది. జిల్లా కేంద్రంలో 80ఏళ్ళు నుండి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ విధుల నిర్వహణకు ఉద్దేశించిన ఉర్దూ రేంజ్ ఆఫీసు శిథిలమైన పెంకుటింట్లో కొనసాగుతోంది. ఏ క్షణానైనా కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న భవనాన్ని పట్టించుకునే వారే లేరు. కూలేందుకు సిద్ధంగా ఉన్న ఉర్దూ రేంజ్ కార్యాలయాన్ని తిరిగి నిర్మించాలనే యోచన లేకపోవడం విద్యాశాఖ పనితీరుకు అద్దం పడుతోంది. సుమారు 100 పాఠశాలలకు ఒక ప్రధాన కేంద్రంగా ఉన్న ఈ కార్యాలయ పరిస్థితి దారుణంగా ఉంది. ఇక్కడ విధులు నిర్వర్తించాలంటే భయం గుప్పెట్లో గడపాల్సిన పరిస్థితి ఉంది. ఉర్దూ రేంజి కార్యాలయానికి సంబంధించిన సొంత స్థలం ఉన్నప్పటికీ భవన నిర్మాణానికి విద్యా శాఖ ముందు రాకపోవడం పట్ల విమర్శలకు తాగిస్తోంది.

బాపట్లలో శిథిలావస్థకు చేరిన ఉర్దూ రేంజ్ కార్యాలయం

అధ్వానంగా వేమూరు-చావలి రోడ్డు

ప్రజాశక్తి - వేమూరు

నియోజకవర్గ కేంద్రమైన వేమూరు నుండి చావలి వెళ్లే రహదారి మరమ్మత్తులు చేపట్టక పోవటంతో అధ్వాన స్థితికి చేరింది. ప్రజల రాక పోవకులకు తీవ్ర అంతరాయంగా మారింది. ఈ రహదారిలో భట్టిప్రోలు, అమృతలూరు, చుండూరు మండలాల నుండి వేమూరు పలు రకాల పనులపై పాదచారులు, వాహన శోధకులు ప్రయాణిస్తూ ఉంటారు. 2014 - 19 మధ్య కాలంలో మెటల్ రోడ్డును బీటీ రోడ్డుగా రూపొందించారు. అప్పటి నుండి గతేడాది వరకు ఈ రోడ్డుపై ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదు. గతేడాది గుంటలు మయమైన ఈ రోడ్డును జెసిబిలతో చదును చేయించి అధికారులు చేతులు దులుపుకున్నారు. కానీ రోడ్డును తారు రోడ్డుగా మార్చటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణల ఉన్నాయి. అప్పటి నుండి వాహన చోధకులు, ప్రయాణికులకు ప్రయాణం

గుంతలు పడిన వేమూరు, చావలి రహదారి

ప్రాణ సంకటంగా మారిందని వాపోతున్నారు. చిన్నపాటి వర్షం పడినా రోడ్డుపై ఏర్పడిన పెద్ద పెద్ద గుంటలు తటాకాలను తలపిస్తున్నాయి. ఈ రోడ్డుపై ప్రయాణం ఎంతో ప్రమాదకరంగా తయారైందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుకు దగ్గరలోని గ్రామాలన్నీ వ్యవసాయ ఆధారిత ప్రాంతాలే కావటం గమనార్హం. బలిజేపల్లి, చావలి, పెరవలి, పెరలిపాలెం తదితర గ్రామ రైతులు రానున్న ఖరీఫ్ సీజన్లో పండిన పంటను వేమురు రైస్ మిల్లులకు నాటుబండ్లు, టైరు బండ్లపై ఈ రోడ్డులోనే రవాణా చేయాల్సి ఉంది. వేమూరులోని సామాజిక ఆరోగ్య ప్రభుత్వ వైద్యశాలకు ఈ మార్గంలో రావాలన్నా రోగులు ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తున్నదనీ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై ఎలాంటి ఆర్టీసీ బస్సులు తిరగటం లేదు. ఆటో డ్రైవర్లు ఈ రోడ్డు దుస్థితిని బట్టి వారి ఇష్టం వచ్చినట్లు ఛార్జీలు డిమాండ్ చేస్తున్నారని ప్రజలు అంటున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఎంత అడిగినా ఇచి ప్రయాణించక తప్పటం లేదని ఆవేదన చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఈ ప్రాంత వాసుల ఇబ్బందులను తొలగించాలని కోరుచున్నారు.

సకాలంలో యూరియా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - కర్లపాలెం

రైతులకు అవసరమైన మేరకు యూరియా సకాలంలో పంపిణి చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. మండలం లోని పెద గొల్లపాలెం పంచాయతీ మార్పు చెన్నయ వారిపాలెం కమ్యూనిటీ హాలులో వ్యవసాయ

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

శాఖ ద్వారా రైతులకు యూరియా పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన మేరకు యూరియా అందజేయాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు. యూరియా ఎక్కడ పంపిణీ చేసేది ముందుగానే రైతులకు సమాచారం తెలియ జేయాలని అన్నారు. రైతు సేవ కేంద్రాలకు వచ్చే రైతులకు టోకెన్లు పంపిణీ చేయాలని అన్నారు. రైతు ఎన్ని ఎకరాల్లో పంటలు వేశారో దానికి సరిపడా యూరియా అందజేస్తే రైతుకు అధిక దిగుబడి వస్తుందని అన్నారు. ఎన్ని ఎకరాల భూములు ఉన్నయి, అ భూముల్లో ఏ పంటలు వేశారు, ఎంత యూరియా అవసరం అవుతుందని, నీటి సౌకర్యం వివరాలు రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎరువుల కొరత, అధిక ధరలు ఉంటే కంట్రోల్ రూమ్ 82470 40131 నెంబర్‌కు ఫోన్ చేసి పిర్యాదు చేయాలని రైతులకు చూచించారు. గతేడాది మండలంలో ఈ రోజు నాటికి ఎన్ని ఎకరాల్లో పంటలు వేశారు, ఇప్పుడు ఎన్ని ఎకరాల్లో పంటలు వేశారని నిర్ధారణ చేసుకున్నారాని, యూరియా ఎంత వచ్చింది, ఇంకా ఎంత అవసరం ఉందని ఎఒను అడిగి తెలుసుకున్నారు. యూరియా పంపిణీ చేసిన వివరాలు ప్రతి రోజు రిజిస్టర్లో నమోదు చేయాలని అన్నారు. ఏ మండలం రైతులకు ఆ మండలంలోనే యూరియా అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డిఓ పి గ్లోరియా, వ్యవసాయ శాఖ ఎడి అన్నపూర్ణ, ఎడి ధనరాజ్, ఎంపిడిఒ ఎ శ్రీనివాసరావు, ఎఒ ఎం సుమంత్ కుమార్ పాల్గొన్నారు.

వైద్యులకు అండగా కూటమి ప్రభుత్వం

ఐఎంఎ జోనల్ సమావేశంలో ఎంఎల్ఎ కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

ప్రభుత్వం వైద్య రంగంలో పెట్టుబడులు అందిస్తుందని, మౌలిక సదుపాయాలు విస్తరించడానికి కృషి చేస్తూ వైద్యులకు అండగా ఉంటుందని శాసన సభ్యులు కొండయ్య అన్నారు. కొత్తపేటలోని రావి సుబ్బారాయుడు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

కళ్యాణ మండపంలో జరిగిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జోనల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య రంగంలో ఎదురవుతున్న సవాళ్లు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగ భావనతో పనిచేయగలిగేది వైద్య వృత్తి మాత్రమేనని అన్నారు. వైద్యులు 24 గంటలు ప్రజల ఆరోగ్య రక్షణ కోసం కష్టాలు పడుతుంటారని అన్నారు. మారుతున్న నేటి జీవనశైలిలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. కొత్త రకాల వ్యాధులు, వైరస్‌లు ఉద్భవిస్తున్నాయని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సమాజాన్ని రోగ విముక్తం చేయడం వైద్యులే చేయగలరని అన్నారు. అందుకే వైద్యులు ఎల్లప్పుడూ ఆధునిక వైద్య సాంకేతికతను ఉపయోగించి సేవలందించాలని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఆరోగ్యరంగాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని అన్నారు. ప్రతి కుటుంబానికి భరోసా ప్రతి వ్యక్తికి రక్షణ ప్రతి రోగికి నాణ్యమైన వైద్యం అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ దిశగా రూ.25 లక్షల వరకు ఆరోగ్య రక్ష పథకం అమలు చేయడం చారిత్రక నిర్ణయమని అన్నారు. ఈ పథకం ద్వారా ఏ రకమైన వ్యాధి వచ్చినా అందరికీ భరోసా కలుగుతుందని అన్నారు. ప్రజల ఆరోగ్యం కాపాడటమే సమాజ అభివృద్ధికి పునాది అన్నారు. త్వరలోనే ప్రభుత్వ దవాఖానల్లో ఆధునిక పరికరాలు, వైద్య సిబ్బంది నియామకాలు చేపడతామని అన్నారు. ఐఎంఎ ప్రతినిధులు మాట్లాడుతూ వైద్య రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవసరమైన మౌలిక వసతులపై సూచనలు చేశారు. సమావేశంలో ఐఎంఎ రాష్ట్ర నాయకులు డాక్టర్ భవాని ప్రసాద్, చీరాల బ్రాంచ్ అధ్యక్ష్య, కార్యదర్శులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ పి శ్రీకాంత్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హిందీ పండి పండితులు

హిందీ దివస్ వేడుకలు

ప్రజాశక్తి - బాపట్ల

భారత దేశంలో హిందీ భాషకు ఎంతో ప్రాధాన్యత ఉందని మున్సిపల్ హై స్కూల్ హిందీ పండిట్ కె సత్యనారాయణ అన్నారు. స్థానిక పురపాలక ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన హిందీ దివస్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 200 మంది విద్యార్థులు హిందీ ప్రాథమిక పరీక్ష రాశారు. సత్యనారాయణ మాట్లాడుతూ భారత దేశ సమైక్యతకు ప్రతీకగా హిందీ భాష నిలుస్తోందని అన్నారు. విభిన్న భాషల సమాహారంగా ఉన్న భారత దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించే సమయంలో గాంధిజీ ఎక్కువగా హిందీలోనే మాట్లాడేవారని అన్నారు. జాతి మొత్తం ఆ భాషను సులువుగా అర్థం చేసుకునేవారని అన్నారు. అందుకే 1949 సెప్టెంబర్ 14న హిందీని జాతీయ భాషగా రాజ్యాంగంలో పొందుపర్చారని అన్నారు. ప్రజల మధ్య సద్భావన, సంస్కృతిని కాపాడడంలో హిందీకి అధికార భాష హెూదానిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 343 (1) రూపొందించారని అన్నారు. అప్పటి నుంచి హిందీ రాజ భాష హెూదా సంతరించుకుందని అన్నారు. దేవనగరీలిపిగా పేరొందిన హిందీని ఎందరో మహాకవులు, రచయితలు సుసంపన్నం చేశారని తెలిపారు. వివిధ సేవా కార్యక్రమాలతో పాటు హిందీ ప్రచారానికి తమ వంతు కృషి చేస్తూ రాజభాష అందరికీ దగ్గర చేస్తున్నారని అన్నారు. 1937లో స్వాతంత్ర్య సమరయోధుడు సి రాజ గోపాలాచారి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తమిళనాడులోని పాఠశాలల్లో హిందీని తప్పనిసరి చేయాలని నిర్ణయించిందని అన్నారు. ప్రతి ఏటా సెప్టెంబర్ 14న హిందీ దివస్ నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పలువురు హిందీ పండితులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నగరం : స్థానిక వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలలో హిందీ బాషా దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ మాట్లాడుతూ అధికారిక భాష హిందీ దేవనాగరి లిపి నుంచి రూపొందించబడినదని, ఉద్యోగ అవకాశాల్లో కీలకంగా మారిందని అన్నారు. ప్రపంచంలో ఎక్కువగా మాట్లాడే బాషల్లో హిందీ భాష రెండవ స్థానం ఉన్నదని అన్నారు. విభిన్న భాషలున్న దేశంలో ఒకరి బావావేశాలు మరొకరు అర్థం చేసుకునేందుకు ఒక ఉమ్మడి బాష అవసరం ఉందని తెలిపారు. కళాశాల సెక్రటరీ వల్లభనేని బుచ్చయ్య చౌదరి హిందీ భాష దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వకృత్వ, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో హిందీ భాషా పండితులు వివి జయలక్ష్మి, పి వెంకటనారాయణ, ఆర్ ప్రసన్నబాబు, సురేఖరాణి, కళాశాల సూపర్డెంట్ అమరేష్ రెడ్డి పాల్గొన్నారు.

బాపట్ల : భారత స్వాతంత్ర్య సమరంలో హిందీ భాష భారతీయులకు ఒక అనుసంధాన భాషగా ఉపయోగ పడిందని హిందీ పండితులు అబ్దుల్ ఖాదర్ జిలాని అన్నారు. హిందీ భాషా దినోత్సవం సందర్భంగా సాహితీ భారతీ ఆధ్వర్యంలో ఆదివానం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక ప్రజలు మాట్లాడే భాషల్లో హిందీ భాష ఒకటని అన్నారు. సాహితి భారతి ఉపాధ్యక్షులు మర్రి మాల్యాద్రిరావు మాట్లాడుతూ హిందీ భాషలో అద్భుత సాహిత్యం ఉందని అన్నారు. కార్యక్రమంలో సాహితీ భారతి సభ్యులు దగ్గుమల్లి శామ్యూల్, ఆదం షఫీ, ఎం జాకబ్, షేక్ నిహాల్ అహ్మద్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కె కాళిదాసు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లు దామచర్ల, కందుల

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం కలెక్టర్‌గా పనిచేసి బదిలీపై గుంటూరు జిల్లాకు వెళుతున్న కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియాను ఒంగోలు, మార్కాపురం ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధనరావు, కందుల నారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలెక్టర్‌ను కలిసిన వారు పలు విషయాలు చర్చించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్, టిడిపి సీనియర్ నాయకులు టివి.శ్రీరామమూర్తి, టిడిపి ఒంగోలు నగర అధ్యక్షుడ బండారు మదన్, టిడిపి నాయకులు శింగరాజు రాంబాబు, మేడికొండ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

సరళీకరణ విధానాలతో అసమానతలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్. బాబూరావు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

పాలకులు అనుసరిస్తున్న సరళీకరణ విధానాల వల్ల సమాజంలో అసమానతలు రోజురోజుకీ పెరుగుతున్నాయని, పట్టణాలు మతోన్మాదం మరియు కార్పొరేట్ దోపిడీ కేంద్రాలుగా మారిపోతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సిహెచ్. బాబూరావు విమర్శించారు. స్థానిక సుందరయ్య భవనంలో నగర కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. నగర కార్యదర్శివర్గ సభ్యుడు జి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బాబూరావు మాట్లాడారు. పట్టణాల్లో బహుళజాతి కంపెనీలు, కార్పొరేట్ సంస్థలు రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాన్ని అదనపు లాభాల సాధనంగా మార్చుకున్నాయని తెలిపార. సామాన్యులకు గహవసతి దొరకని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం గహ సముదాయాలను కూడా వ్యాపార వస్తువులుగా మలిచిందని దుయ్యబట్టారు. మురికివాడలు

మాట్లాడుతున్న సిహెచ్. బాబూరావు

నిర్లక్ష్యం పాలవుతున్నాయని తెలిపార. ఆరోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ లాంటి సంస్థలు పట్టణాల్లో మతోన్మాదాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టి విషబీజాలు నాటుతున్నాయన్నారు. ప్రజల ప్రయోజనాల కంటే కార్పొరేట్ లాభాల కోసం పనిచేస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ప్రజా సమస్యలపై ఉద్యమాలు మరింత ఉధతం చేస్తామని తెలిపారు. నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో సుమారు మూడు లక్షల జనాభా, 75 వేల కుటుంబాలు ఉన్నప్పటికీ ప్రజల సమస్యలు పట్టించుకునే వారే లేరన్నార. ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పట్టాలు, టిట్కో ఇళ్లు ఇప్పటికీ అందలేదన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం హామీ గానే మిగిలిందన్నారు.పట్టణ నడిబొడ్డున ఉన్న 83 సెంట్ల మార్కెట్ స్థలాన్ని పీపీపీ విధానంలో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో తంబి శ్రీనివాసులు, ఎన్. వీరాస్వామి, ఆదిలక్ష్మి, బివి.రావు, కె. శ్రీనివాసరావు, దామా శ్రీనివాసులు, ఎవి.పుల్లారావు, సిహెచ్. రాంబాబు, జి. నరసయ్య, బి.ముసలారెడ్డి, టి. భక్తసింగ్ రాజు, పివిఆర్. సుబ్బారావు, జి.శేషయ్య పాల్గొన్నారు.

బీచ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించాలి

బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బీచ్ ఫెస్టివల్‌ను రాష్ట్రీయ పండుగలా ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. బీచ్ ఫెస్టివల్ నిర్వహణపై పర్యాటక శాఖ రాష్ట్ర స్థాయి అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టరేట్ నుంచి హైబ్రిడ్ మోడ్‌లో ఆదివారం వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బీచ్ ఫెస్టివల్ నిర్వహణకు సూర్యలంక బీచ్‌ను ఈనెల 25 నాటికి సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈనెల 26, 27, 28 తేదీల్లో సూర్యలంక తీరం వద్ద వేడుకలు జరపాలన్నారు. సాయంత్రం నాలుగు నుంచి రాత్రి 8 గంటల వరకు వేడుకలు జయప్రదంగా నిర్వహించాలన్నారు. ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వేడుకల్లో పాల్గొంటారన్నారు. భారీ స్థాయిలో 100 ఫుడ్ కోర్టులు, 350 మరుగుదొడ్లు, పర్యాటకులకు చాలినంత బాతింగ్ షవర్లు, 200 డ్రెస్ చేంజింగ్ రూమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఇతర జిల్లాలో నుండి ముఖ్యమైన అతిథులు వచ్చే అవకాశం ఉన్నందున అతిథులకు ప్రత్యేకంగా వసతులు కల్పించాలని సూచించారు. వేడుకలకు సంబంధించి తేదీల వారీగా షెడ్యూల్ విడుదల చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. సినీ రంగ ప్రముఖులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆ మూడు రోజులు తీర ప్రాంతమంతా కోలాహలంగా ఉండేలా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పర్యాటకుల భద్రత, సంరక్షణ బాధ్యత పోలీసు, మత్స్య, అటవీశాఖ అధికారులపై ఉందన్నారు. వేడుకలకు వచ్చే ప్రజలు సరదాగా వాలీబాల్, కబడ్డీ వంటి ఆటలు ఆడుకోడానికి క్రీడా సామగ్రి సిద్ధంగా ఉంచాలన్నారు.ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి.గంగాధర్ గౌడ్, పర్యాటక కార్పొరేషన్ డిప్యూటీ సిఇఓ శ్రీనివాస్, ప్రమోద్, ఆర్‌డిఓలు, జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగిరెడ్డి, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

తీరంలో పరిశీలన

బాపట్ల సూర్యలంక బీచ్‌లో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్స్ పనులను వేగవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. సూర్యలంకలో బీచ్ ఫెస్టివల్స్ నిర్వహించడానికి అవసరమైన పనులను జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ,బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బీచ్ ఫెస్టివల్ నిర్వహించడానికి అధికారులకు కేటాయించిన పనులను చురుగ్గా చేపట్టాలన్నారు. బీచ్ ఫెస్టివల్ సందర్భంగా వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సూర్యలంక బీచ్ ప్రాంతంలో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. బీచ్ ఫెస్టివల్ సభా ప్రాంగణాన్ని, పార్కింగ్ ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, జిల్లాపంచాయతీ అధికారి ప్రభాకరరావు , జిల్లా రవాణా శాఖ అధికారి పరంధామ రెడ్డి, పౌరసరఫరాల శాఖ డిఎం శివ పార్వతి, డిఎస్ఓ జలీల్ బాషా, జిల్లా టూరిజం అధికారి నాగిరెడ్డి, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

తీరంలో పర్యటిస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే

పంచాయతీల ఆర్థికాభివృద్ధికి కృషి

- పంచాయతీరాజ్ ఒన్ మెబైల్ యాప్
- స్వామిత సర్వే
- చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు
- బాపట్ల జిల్లా పంచాయతీ అధికారి కెఎల్. ప్రభాకరరావు

ముఖాముఖి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బల పడేందుకు తగు కృషి చేస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి కెఎల్. ప్రభాకరరావు తెలిపారు. పంచాయతీల్లో ఆర్థిక వనరులను గుర్తించి స్వయం సమద్ధి సాధించేలా చర్యలు తీసుకోవడంతో పాట పారిశుధ్యం, పచ్చదనం పెంపునకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని పంచాయతీల పాలన, అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన వివరించారు. అవన్నీ ఆయన మాటాల్లోనే...

పంచాయితీల స్థిరమైన అభివద్ధి లక్ష్యాల కోసం తొమ్మిది ప్రధాన అంశాలపై దష్టి సారించారు. పేదరికం లేని, మెరుగైన జీవనోపాధి గల పంచాయతీలు, ఆరోగ్యవంతమైన పంచాయతీలు, పిల్లలకు అనుకూలమైన పంచాయతీలు, నీటి వనరులు సమద్ధిగా ఉన్న పంచాయతీలు, శుభ్రమైన, పచ్చని పంచాయతీలు, స్వయంసమద్ధి, మౌలిక సదుపాయాలు ఉన్న పంచాయతీలు, సామాజిక న్యాయం, భద్రత ఉన్న పంచాయతీలు, సుపరిపాలన ఉన్న పంచాయతీలు,మహిళలకు అనుకూలమైన పంచాయతీలుగా తీర్చి దిద్దాలనేది ప్రభుత్వ సంకల్పమన్నారు.

పంచాయతీరాజ్ ఒన్ మెబైల్ యాప్

గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, తాగునీరు, సాంకేతికతతో పర్యవేక్షించడం కోసం రూపొందించినదే మొబైల్ అప్లికేషనే పంచాయతీరాజ్ ఒన్ మెబైల్ యాప్. పారిశుధ్య కార్యక్రమాలను పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా నిర్వహించడం ఈ యాప్ ప్రధాన ఉద్దేశం. ఈ యాప్ ద్వారా గ్రామ పంచాయతీ స్థాయిలోని డ్రైనేజీల శుభ్రత, తాగునీటి సరఫరా, స్టాక్‌కు సంబంధించిన వివరాలను అప్‌డేట్ చేయవచ్చు. పనుల నాణ్యతను నిర్ధారించడానికి, పనులు జరగడానికి ముందు మరియు తర్వాత జిపిఎస్ లొకేషన్‌తో పాటు ఫోటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

స్వర్ణ పంచాయతీలు

గ్రామ పంచాయతీల ఆర్థిక లావా దేవీలు, సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడం కోసం 'స్వర్ణ పంచాయత్' అనే వెబ్ మరియు మొబైల్ అప్లికేషన్‌ను ప్రవేశ పెట్టారు. ప్రజలు ఇంటి పన్ను, తాగునీటి పన్ను వంటి వాటిని డిజిటల్ పద్ధతిలో చెల్లించవచ్చు. పన్ను వసూళ్లలో అవకతవకలకు అడ్డుకట్ట పడుతుంది. పంచాయతీలకు ప్రభుత్వ నిధుల కేటాయింపులు, ప్రజలు చెల్లించిన పన్నులు, వాటి ఖర్చుల వివరాలు అన్నీ పారదర్శకంగా ఉంటాయి. నిధుల వినియోగంలో అక్రమాలకు తావు ఉండదు. ఆస్తి వివరాల డిజిటలైజేషన్ ద్వారా గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రతి ఇంటి ఆస్తి వివరాలను, యజమాని ఆధార్ నెంబర్ వంటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. పంచాయతీ కార్యదర్శులు గుండుసూది కొనుగోలు నుంచి పొరుగు సేవల జీతాల వరకూ ప్రతి ఖర్చుకు సంబంధించిన బిల్లులను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

స్వామిత సర్వే

స్వామిత కేంద్ర ప్రభుత్వంచే ప్రారంభించబడిన కేంద్ర రంగ పథకం. డ్రోన్ టెక్నాలజీ లాంటి ఆధునిక పద్ధతులను ఉపయోగించి గ్రామీణ ఆవాస ప్రాంతాలలో ఆస్తులను సర్వే చేయడం. దీని ద్వారా ఆస్తి యజమానులకు చట్టపరమైన యాజమాన్య పత్రాలు (ప్రాపర్టీ కార్డులు లేదా టైటిల్ డీడ్‌లు) ఇవ్వడం ఈ పథకం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. స్వామిత సర్వేను పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర రెవెన్యూ విభాగం, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ, సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో జల్లాలో అమలు చేస్తున్నారు.

స్వర్ణ ఆంధ్ర..స్వచ్ఛఆంధ్ర

స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛఆంధ్ర, స్వచ్ఛ సంకల్ప కార్యక్రమం అమలులో భాగంగా గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణను రిక్షాలు, గ్రీన్ అంబాసిడర్లు, క్లాప్ మిత్రల ద్వారా పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. పన్నుల వసూళ్ళను నూరు శాతం చేసి, పంచాయతీల్లో అభివద్ధి పనులు చేపట్టనున్నారు. గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు జరిగిన వాటికే ఆర్థిక సంఘం నిధులు విడుదల అవుతున్నాయి.బాపట్ల జిల్లాలో పలు గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగని కారణంగా ఆర్థిక సంఘం నిధులు కాలేదు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు

జిల్లాలోని పంచాయతీల్లో స్వచ్ఛతా కార్యక్రమాల అమలులో భాగంగా నివాసాల నుంచి తడి చెత్త, పొడి చెత్త, హానికారక చెత్తను వేర్వేరుగా సేకరించే కార్యక్రమాన్ని చేపట్టాం. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ఇళ్ల నుంచి రోజువారీగా చెత్త సేకరించి గ్రామం వెలుపల నిర్మించిన చెత్త సేకరణ కేంద్రాలకు తరలించే చర్యలు చేపట్టాం. ఈ కేంద్రాలలో తడి,పొడి చెత్తను వేరు చేసి, తడి చెత్త ద్వారా ఎరువుల తయారీ కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నాం. కేంద్రాల్లో ఏర్పాటు చేసిన తొట్టెల్లో తడి చెత్తను ఉంచి వాన పాముల ద్వారా వర్మి కంపోస్టు తయారీకి చర్యలు చేపట్టాం. పొడి చెత్తలో వచ్చే ప్లాస్టిక్ బాటిల్స్, పేపర్లు, ఇతర పొడి వ్యర్థాలు, వర్మికంపోస్టు అమ్మకాల ద్వారా గ్రామ పంచాయతీలకు కొంత ఆదాయం సమకూరే చర్యల కోసం చెత్త నుంచి సంపద కేంద్రాలకు రూప కల్పన చేశారు. ఇవి పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు.